# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

మంగళవారం 01 జూలై 2025






## ఫిర్యాదుదారులకు త్వరితగతిన పరిష్కారం అందించండి

### జాయింట్ కలెక్టర్ అదితి సింగ్..



**కడప,జూన్ 30, ప్రభాతవార్త**

పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు త్వరితగతిన పరిష్కారం అందించాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని సభా భవన్ లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ అదితి సింగ్,వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ మాట్లాడుతూ... ఫిర్యాదులకు అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని సూచిస్తూ అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్డీసీ, ఇన్చార్జ్ డిఆర్ఓ వెంకటపతి, డ్వామా పిడి ఆది శేషారెడ్డి, , డిఆర్డిఏ పిడి రాజ్యలక్ష్మి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఇన్చార్జి మంత్రి సవితను కలిసిన ఉక్కు ప్రవీణ్ రెడ్డి

**ప్రొద్దుటూరు జూన్ 30 ప్రభాతవార్త**



ప్రొద్దుటూరు నియోజకవర్గ టిడిపి మాజీ ఇంచార్జ్ డాక్టర్ జీవీ ప్రవీణ్ కుమార్ రెడ్డి మంగళవారం రాష్ట్ర బీసీ సంక్షేమం గౌలీ మరియు చేనేత శాఖల మంత్రివర్యులు మరియు కడప జిల్లా ఇన్చార్జ్ మంత్రి ఎస్ సవితను మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా ఆయన ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధి ప్రజాసంక్షేమంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు మండల టిడిపి కన్వీనర్ బోడెల బాబుల్ రెడ్డి కడప జిల్లా టిడిపి అధికార ప్రతినిధి ఆవుల దస్తగిరయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రచందనంతో పాటు ఔషధ మొక్కలు..!

### ఔషధ పరిశ్రమల స్థాపనకు అనుకూలం

### అయినా ఫలితం శూన్యం

### దశాబ్దాలుగా ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం



**(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)**

అన్నమయ్య జిల్లాలోని రాజంపేట అటవీ డివిజన్ ప్రపంచంలోనే విశిష్టత కలిగి ఉంది. ఈ అటవీ డివిజన్ పరిధిలో లభించే ఎర్రచందనానికి ప్రపంచంలోనే అత్యధిక ధర పలుకుతుంది. వృక్ష సంపదలో ఎర్ర చందన వృక్షాలకు ప్రత్యేక స్థానం ఉంది. ప్రపంచ ప్రఖ్యాతి కలిగిన ఎర్రచందన వృక్షాలతో పాటు ఔషధ మొక్కలకు కూడా ఈ అటవీ డివిజన్ నిలయంగా ఉంది. ప్రభుత్వము నిపుణులతో నిర్వహించిన సర్వేల్లో కూడా ఈ అటవీ ప్రాంతంలో ఔషధ మొక్కలు అనేకం లభ్యమవుతున్నట్లు వెల్లడయింది. ఔషధ మొక్కలకు నిలయంగా అటవీ ప్రాంతం ఉన్నందున ఔషధ పరిశ్రమల స్థాపనకు అనుకూలమైన వాతావరణ ఉన్నప్పటికీ సరైన దిశలో కృషి చేయని కారణంగా ఈ అటవీ ప్రాంతంలో ఔషధ పరిశ్రమల ఏర్పాటుకు మార్గము సుగమం కావడం లేదన్న విమర్శలున్నాయి. ఈ అటవీ ప్రాంతంలో ప్రతి చిరుకొమ్మ ఔషధపరంగా చేవగలిగిందంటారు. ఇక్కడ లభించే వివిధ జాతుల మొక్కలు మూలికా వైద్యానికి దోహదపడుతున్నాయి. వీటి అవసరాలు తెలియని వారికి ఆ మొక్కల ఉపయోగం ఏమిటో తెలియడం లేదు. మన కళ్ల ఎదుటే ఎన్నో ఔషధ మొక్కలు కనిపిస్తున్నా వాటిని రోజు చూస్తుంటాము, కానీ అవి పిచ్చి మొక్కలను తీసిపారేస్తుంటాం. కానీ వీటి ఉపయోగాలు తెలిస్తే ఔరా! వీటికి ఇంత శక్తి ఉందా అని ఆశ్చర్యపడక తప్పదు. ఈ అటవీ డివిజన్ పరిధిలో 60 కి పైగా వివిధ వ్యాధులను నయం చేసే ఔషధ మొక్కలు ఉన్నట్లు పరిశోధనల్లో వెల్లడయింది. వనమూలికల చికిత్స విధానంపై ప్రస్తుతం స్థానికంగా అభివృద్ధి చెందనందునే వీటికి ప్రాముఖ్యత లభించడం లేదు. అయితే ఇటీవల కాలంలో వర్షాభావ పరిస్థితులకు తోడు అడవుల నరికివేత, అడవుల కాల్చివేత, స్మగ్లర్ల కారణంగా డివిజన్ అటవీ ప్రాంతంలో ఎంతో విలువైన వృక్షాలు కనుమరుగైపోతూ వనమూలికా వైద్యానికి కూడా విఘాతం కలిగిస్తున్నట్లు తెలుస్తోంది. అటవీ ప్రాంతంలో నివసించే వారిలో కొద్దిమందికి మాత్రమే ఇక్కడ లభించే ఔషధ మొక్కలపై అవగాహన ఉంది. పాము కాటుకు గురైన వ్యక్తి శరీరంలో విష ప్రభావం తగ్గించేందుకు అవసరమైన ఔషధ మొక్కల ఆకులను నమిలి మింగడం వల్ల మూడు నిమిషాల్లోనే వాంతులు, విరేచనాలు అయ్యి విష ప్రభావం తగ్గుతుందని తెలుస్తుంది. ఆ తరువాత బండి గురిజాకు మొక్కల ఆకులు, మిరియపు గింజలతో కలిపి తయారు చేసిన ఔషధపు మిశ్రమము విష ప్రభావాన్ని బాగా తగ్గించే గుణం ఉన్నట్లు మూలికా వైద్యులు చెబుతున్న మాట. వీటన్నింటిపై సరైన రీతిలో ప్రభుత్వము పరిశోధనలు జరిపి ఔషధ పరిశ్రమల స్థాపనకు కృషి చేయాల్సిన అవసరం ఉంది. అంతేకాకుండా ఇక్కడ లభించే కలబంద వల్ల ఒంటికి చలవ చేస్తుందని, దీర్ఘ కాలంగా తగ్గని కురుపుల పై రాస్తే తగ్గుతాయని, శరీరంపై వాపులకు ఈ ఆకులు వేసి కడితే వాపులు తగ్గుతాయని, గచ్చ ఆకులు ఉడికించి గోరువెచ్చగా ఉన్నప్పుడు వరిబీజానికి మంచి ఔషధంగా పనిచేస్తుందని, గజ్జికాయ పప్పులకు విషము తగ్గించే ఔషధ గుణం ఉందని, అలాగే గవడ బిల్లలకు, గజ్జి,. తామర వంటి చర్మవ్యాధులకు చక్కని ఔషధంగా పనిచేస్తుందని మూలికా వైద్యుల ద్వారా తెలుస్తోంది. ఇలాంటి ఎన్నో ఔషధ గుణాలున్న మొక్కలు ఈ అటవీ ప్రాంతం అధికంగా ఉన్నట్టు తెలుస్తోంది. గజ్జికాయ పప్పులు ఈ అటవీ డివిజన్ పరిధిలో పుష్కలంగా లభిస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండా అతిమూత్ర వ్యాధి నివారణకు అవసరమైన ఔషధ మొక్కలు అటవీ ప్రాంతంలో ఉన్నాయని వీటి ఆకులు కాల్చి బూడిదకు వెన్న కలిపి రాస్తే కాలిన బొబ్బలు తగ్గుతాయని, వీటి పువ్వులు నీటిలో మరిగించి ఆ కషాయం రోజుకో మారు తాగితే దగ్గు,శ్వాస కోశ వ్యాధులకు చక్కని ఔషధంగా పనిచేస్తుందని అందుతున్న సమాచారం. గిరిజనుల అడవికి వెళ్లి చెట్టు నరికే సమయములో గాయాలయితే బ్రరింక చెట్టు పాలు పట్టిలా కలిపి కడితే అతుకు పోతుందని చెబుతారు. లేత వేపాకులను ఇక్కడ లభించే ఇతర ఔషధ మొక్కలతో నీళ్ల కలిపి మరిగించి రోజుకు రెండు మార్లు తాగితే మలేరియా వంటి జ్వరాలకు చక్కని ఔషధంగా తయారు చేయవచ్చు అంటున్నారు. ఇంటి పెరట్లో లభించే జిల్లేడు పాలు, ఆకులతో కూడా పంటి నొప్పులు, బహిష్టు నొప్పులకు, కీళ్ల నొప్పుల నివారణకు ఔషధంగా తయారు చేయవచ్చు అంటున్నారు. నెత్తురు గడ్డల నివారణకు అవసరమైన వనమూలికలు అటవీ ప్రాంతంలో అత్యధిక లభిస్తున్నట్లు కూడా సమాచారం. దోమల నివారణకు ఇక్కడ లభించే పచ్చిబిళ్ళ ఆకుల పొగ చాలా బాగా పని చేస్తుందని, అధిక రక్తపోటు బాధ నుంచి విముక్తి అయ్యే ఔషధ మొక్కలకు చెందిన వేర్లు లభ్యమవుతున్నట్లు, కుక్క కాటు వల్ల ఎటువంటి ప్రమాదము లేకుండా అవసరాన్ని తయారు చేసే ఔషధ మొక్కలు ఇక్కడ ఉన్నట్లు, అతిసార వ్యాధిని నివారించే రాగి చెట్టు బెరడు మామిడి చెట్టు బెరడు ఇక్కడ అధికంగా లభిస్తుంది. నేర ఉసిరి మొక్కను వేర్లతో పసి పిల్లల అనేక వ్యాధులు నివారించే అవసరం తయారు చేయవచ్చని నిపుణులు చెబుతున్న మాట. ఈ అటవీ ప్రాంతంలో లభిస్తున్న వివిధ రకాల ఔషధ గుణాలున్న మొక్కలు పెంచేందుకు అటవీశాఖ కూడా సుదీర్ఘకాలం నుంచి కృషి చేస్తుంది. ఇందుకోసం ఫీల్డ్ గైడ్ అనే మెడిసినల్ ప్లాంట్ పుస్తకాన్ని అటవీ శాఖ అన్ని రేంజ్ కార్యాలయాలకు గతంలో సరఫరా చేసింది. ఈ పుస్తకములో ఏ ఏ మొక్కల వల్ల ఎలాంటి ఉపయోగాలు ఉన్నాయి, ఔషధ గుణాలు ఉన్నాయన్న సమాచారాన్ని తెలియజేసింది. ఈ అటవీ డివిజన్లో లభించే గురువింద గింజల చెట్టు ఆకులు నల్ల తుమ్మ, కుప్పింతాకు, మారేడు, బ్రహ్మమూలికా, కుక్క గొడుగు, కలబంద, బలురక్కసిపొదల్లో అనేక ఔషధ గుణాలు ఉన్నట్లు సమాచారం. వాటి ఉపయోగాలు తెలియని ఎన్నో చెట్టుమొక్కలు ఈ అటవీ ప్రాంతంలో ఉన్నాయి. ప్రభుత్వం సరైన దిశలో చర్యలు తీసుకుంటే రాజంపేట అటవీ డివిజన్ పరిధిలో లభించే ఔషధ మొక్కల ఆధారంగా ఆయుర్వేద వైద్యం అభివృద్ధి పరిచే వీలుంది అలాగే వీటివల్ల గిరిజనులకు ఉపాధి సౌకర్యాలు పెంపొందించవచ్చు. అవసరం మొక్కల ఆధారంగా ఔషధ పరిశ్రమ ఏర్పాటుకు వీలుంది. కనుక స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించి ఇక్కడ లభిస్తున్న అవసరమొక్కలను శాస్త్రీయంగా గుర్తించి ఔషధ పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాల్సి ఉంది. తద్వారా స్థానికంగా ఉపాధి సౌకర్యాలు మెరుగవుతాయి.

## కురబలకోట వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

### దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన రాష్ట్ర మంత్రులు



**కురబలకోట, జూన్ 30 ప్రభాతవార్త :**

కురబలకోట మండలం ముంబై-చెన్నై జాతీయ రహదారిలో చెన్నామర్రిమిట్ట వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బిసి.జనార్థన్‌రెడ్డి, మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, తంబళ్లపల్లె నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డిలు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. బాధితులకు అత్యవసర వైద్యసేవలు అందించాలని మదనపల్లె జిల్లా ఆసుపత్రి అధికారులను వారు ఆదేశించారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. టెంపో ట్రావెలర్స్‌లో తిరుమలకు వెళ్ళి దైవదర్శనం చేసుకొని తిరిగి స్వగ్రామమైన కర్నాటకరాష్ట్రం బాగేపల్లికు వెలుతుండగా మార్గమధ్యంలో చెన్నామర్రి మిట్ట వద్ద కంటైనర్ ఢీ కొనడంతో ఈ ఘోర ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడిక్కడే మృతి చెందారు. మరో 12మంది తీవ్ర గాయాలయ్యాయి. మృతులు కర్నాటక రాష్ట్రం బాగేపల్లికుచెందిన మేఘాస్(17), చరణ్(17), శ్రావణి (28)లుగా గుర్తించారు. క్షతగాత్రులను మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. ఈ ప్రమాదంపై జయచంద్రారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. యువత మృతి చెందడం పట్ల దిగ్భ్రాంతిని వ్యక్తపరుస్తూ క్షతగాత్రులకు మెరుగైన చికిత్సలు అందించాలని వైద్యాధికారులను కోరారు.

## రాజంపేటలో టిడిపి సంస్థాగతంగా బలోపేతం కావాలి

### జగన్ రాజుకు నారా లోకేష్ ఆదేశం



**రాజంపేట, జూన్ 30 ప్రభాతవార్త**

రాజంపేట నియోజవర్గంలో పార్టీ సంస్థాగతంగా బలోపేతానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి లోకేష్ ఆదేశించారు. విద్యా, ఐటీ శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ బాబును టిడిపి జిల్లా సోమవారం మర్యాదపూర్వకంగా కలిసారు. గుంటూరు టిడిపి కేంద్ర కార్యాలయంలో జగన్ రాజు కలిసారు. పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో నారా లోకేష్ బాబు చమర్తిని ఆత్మీయంగా పలకరించారు.రాజంపేటలో జూలై రెండవ తేదీ నుంచి జరగబోయే సుపరిపాలన మొదటి అడుగు ప్రతి ఇంటికి తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలంలో ప్రవేశపెట్టిన అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలను ప్రజలకు సవివరంగా తెలియజేయాలని ఆదేశించారు. అలాగే రాజంపేట నియోజకవర్గంలో టిడిపి బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

## బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్‌తో రమేష్ నాయుడు భేటీ

**రాజంపేట, జూన్ 30 ప్రభాతవార్త**



విజయవాడలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సంస్థాగత ఎన్నికలలో రాష్ట్ర అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన టీవీఎన్ మాధవ్ రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు పోతుగుంట రమేష్ నాయుడు సోమవారం కలిశారు. ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా మాధవ్ ను దుశ్యాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పివిఎన్ మాధవ్ ఏబీవీపీలో విద్యార్థి నాయకుడిగా ,బీజేవైఎం లో యువ నాయకుడిగా పార్టీలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, ఎమ్మెల్సీగా ప్రస్తుతం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పని చేశారనీ, పార్టీకి విధేయతగా ఉండడం వల్లే రాష్ట్ర అధ్యక్షుడుగా ఎన్నికయ్యారని కొనియాడారు. ఒక సాధారణ కార్యకర్తను రాష్ట్ర అధ్యక్షులుగా బిజెపి అధిష్టానం ఎన్నుకోవడం ఇది మంచి శుభ పరిణామం అన్నారు.ఈ సందర్భంగా పివిఎన్ మాధవ్ , పోతుగుంట రమేష్ నాయుడు ఏబీవీపీలో కలిసి పని చేసిన మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ జిల్లా ఇంచార్జ్ నర్సింగరావు పాల్గొన్నారు.

# దైవ దర్శనం చేసుకుని తిరిగి వెళ్తూ కానరాని లోకాలకు..

### కురబలకోట మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం... ముగ్గురు దుర్మరణం... 12 మందికి గాయాలు, ఒకరి పరిస్థితి విషమం... మూడు కుటుంబాల్లో విషాదం



లారీ డీ కొనడంతో నుజ్జు నుజ్జు అయిన టెంపో



క్షతగాత్రులతో మాట్లాడుతున్న డిఎస్పీ



**మదనపల్లెక్రైమ్/ కురబలకోట, జూన్ 30 ప్రభాతవార్త.**

వ్యవసాయం చేసుకుంటూ జీవనం గడిపే మూడు కుటుంబాలు. రెండు కుటుంబాల్లోని ఇద్దరు పిల్లలు ఇటీవలే పదో తరగతి పాసై ఇంటర్ (పీయూసీ) లో చేరారు. దీంతో తిరుమలకు వెళ్లి వెంకటేశ్వర స్వామి దర్శనం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఒకే గ్రామం వారు, దగ్గరి బంధువులు కావడంతో మూడు కుటుంబాలకు చెందిన 14 మంది సభ్యులు టెంపో ట్రావెలర్ ను మాట్లాడుకుని శనివారం తిరుమలకు వెళ్లారు. ఆదివారం సాయంత్రం వెంకటేశ్వర స్వామి వారిని దర్శనం చేసుకుని, సోమవారం తెల్లవారుజామున స్వగ్రామానికి బయలుదేరారు. మరికొద్ది సేపట్లో స్వగ్రామం చేరుకోవాల్సి ఉండగా, మార్గమధ్యంలోని కురబలకోట మండలం, చెన్నామర్రి మిట్ట వద్ద ఉదయం 6 గంటల సమయంలో కంటైనర్ లారీ, టెంపో ట్రావెలర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒక్కో కుటుంబం లో ఒక్కొక్కరు చొప్పున ముగ్గురు దుర్మరణం చెందారు. 12 మంది గాయపడ్డారు. వీరిలో నలుగురు పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ సంఘటన మూడు కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. ఈ హృదయ విదారక సంఘటన సోమవారం కురబలకోట మండలంలో జరిగింది. ముదివేడు పోలీసులు, బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం బాగేపల్లి కు చెందిన ఒక కుటుంబంలోని నరసింహారెడ్డి(49), రూప(42), మేఘర్ష్(17), ఆదర్శ(15), మరో కుటుంబానికి చెందిన రామచంద్ర(53), కళావతి(40), అశోక్(30), దర్శన్(20), శ్రావణి(25), హేమంత్(13), ఇంకొక కుటుంబానికి చెందిన శివప్ప(44), సునందమ్మ(38), చైత్ర(19), చరణ్(17) లు అదే ప్రాంతానికి చెందిన మంజునాథ (48)కు చెందిన టెంపో ట్రావెలర్‌లో శనివారం రాత్రి దైవ దర్శనార్థం తిరుమలకు బయల్దేరారు. ఆదివారం స్వామివారి దర్శనం చేసుకొని, సోమవారం వేకువ జామున తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలోని కురబలకోట మండలం, అంగళ్లు దాటగానే చెన్నా మర్రిమిట్ట మీద ఎదురుగా వస్తున్న కంటైనర్ లారీ వీరి టెంపోను ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో టెంపో ట్రావెలర్ నుజ్జునుజ్జు కావడంతో సంఘటనా స్థలంలోనే శ్రావణి, మేఘర్ష్, చరణ్ లు మృతి చెందారు. మిగతా వారంతా తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను 108లో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో డ్రైవర్ మంజునాథ, నరసింహారెడ్డి, రూప, ఆదర్శ ల పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగళూరుకు తరలించారు. మిగతా వారిని మదనపల్లె ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. నర్సింహారెడ్డి కుటుంబంలో మేఘర్ష్, రామచంద్ర కుటుంబంలో శ్రావణి, శివప్ప కుటుంబంలో చరణ్ మృతి చెందటంతో ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చనిపోయిన ముగ్గురిలో శ్రావణి కి వివాహం కాగా, మేఘర్ష్, చరణ్‌లు ఇటీవల పదో తరగతి పాసై ఇంటర్ ( పీయూసీ) లో చేరారు. ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు మృతి చెందడంతో ఆ కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయయి.

### బాధితులను ఫోన్‌లో పరామర్శించిన మంత్రి మండిపల్లి

ప్రమాద విషయం తెలియగానే రాష్ట్ర యువజన క్రీడలు, రవాణా శాఖా మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మదనపల్లి ఆస్పత్రిలో చికెన్ పొందుతున్న క్షతగాత్రులను ఆయన ఫోన్లో పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. మదనపల్లె ఎమ్మెల్యే తనయుడు టీడిపి యువ నాయకుడు జునైది అక్బరీ ఆస్పత్రి కి చేరుకుని బాధితుల కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అన్ని విధాలా అదుకుంటామని ధైర్యం చెప్పారు.

### సంఘటన పై ఆరా తీసిన డిఎస్పీ

ప్రమాద విషయం తెలియగానే డిఎస్పీ మహేంద్ర, రూరల్ సిఐ సత్యనారాయణ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు అనంతరం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులతో మాట్లాడి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. మృతదేహాలకు శివ పంచాంగాలు పూర్తి చేయించి బంధువులకు అప్పగించారు.

## కూటమి ప్రభుత్వ కుట్రలు చేయడం తగదు

**బద్వేల్ అర్బన్, జూన్ 30, ప్రభాతవార్త**

అధికారం చేతిలో ఉందని కూటమి ప్రభుత్వం వైసిపి నాయకుల పట్ల కుట్రలు చేయడం తగదని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్య రెడ్డి ఘాటుగా విమర్శించారు. ఇటీవల బయనపల్లెలో వైసీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి ఇంటిని కూల్చేసిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో ఆదిత్య రెడ్డి ఆ కూల్చివేతను ప్రత్యక్షంగా పరిశీలించి శ్రీకాంత్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆదిత్య రెడ్డి మాట్లాడుతూ రాత్రికి రాత్రే ఎవరికీ సమాచారం ఇవ్వకుండా అధికారులు ఇల్లు కూల్చడం, ఇంటి లోపల ఉన్న ఫర్నీచర్, ఫ్రిజ్, ఏసీ వంటి సామాన్లు ధ్వంసం చేయడం అత్యంత దారుణమ ని పేర్కొన్నారు."చట్టబద్ధంగా చర్యలు తీసుకోవాలని, ముందుగా డీ-మార్కేషన్, నోటీసులు ఇవ్వకుండా ఇలాంటి చర్యలకు పాల్పడటం పూర్తిగా అక్రమం," అని ఆయన ఖండించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలు ప్రారంభించిందని, బయనపల్లె లో ఇళ్లను కూల్చడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ స్థలం శ్రీకాంత్‌రెడ్డి కుటుంబానికి దాదాపు 60 ఏళ్లుగా ఉంది. 2017లోనే ఈ ఇల్లు నిర్మించబడింది. అప్పట్లో అధికారంలో టీడీపీ ఉన్నప్పటికీ ఎటువంటి అభ్యంతరం చెప్పలేదు. ఇప్పుడు కేవలం రాజకీయ కక్షతోనే ఇలాంటి చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వం అంటే శాంతి భద్రతలు పరిరక్షిస్తూ, న్యాయం జరిగేలా చూడాలని ఇలా అధికార పక్షం వారు అధికారులను ఆడించడం తగదన్నారు. అని అన్నారు. ఈ అరాచకాలను ఎదుర్కొంటామని, బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదనీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, మున్సిపాలిటీ పట్టణ అధ్యక్షులు సుందర రామిరెడ్డి, జడ్పిటిసి చిన్న పోలిరెడ్డి, బద్వేల్ మండల కన్వీనర్ పోకల మల్లేశ్వర్ రెడ్డి, అట్లూరు మండల కన్వీనర్ ముదుమాల ప్రభాకర్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు పార్టీ అధికార ప్రతినిధి బిజీవేముల రామసుబ్బారెడ్డి, బి. కోడూరు మండలం సింగల్ విండో చైర్మన్ ఓబుల్ రెడ్డి ప్రభాకర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వంకల పెద్ద పోలిరెడ్డి, జిల్లా అనుబంధ విభాగాల నాయకులు బ్రహ్మానంద రెడ్డి, రమేష్ బాబు, చాపాటి సాయి నారాయణరెడ్డి, కౌన్సిలర్ ఓబుల్ రెడ్డి, పార్టీ నాయకులు మన్నెం రవీంద్రారెడ్డి, సర్పంచ్ వేణు, ఉప సర్పంచ్ రవికుమార్, ప్రతాప్, ఎంఆర్ఎఫ్ రమణారెడ్డి, సుబ్బరాజు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వాటర్మెన్లకు వేతనాలు చెల్లించాలి

**పీలేరు జూన్ 30 ప్రభాతవార్త:**

పట్టణంలోని ఆర్వో ప్లాంట్ల వద్ద పని చేస్తున్న వాటర్మెన్లకు వేతనాలు చెల్లించాలని ఇన్చార్జి ఎంపీడీవో లతీఫ్ ఖాన్ కు వినతిపత్రం అందజేశారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద వాటర్మెన్లు నిరసన తెలిపారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాటర్మెన్లకు గత 11 నెలలుగా జీతాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పలుమార్లు ఫిర్యాదు చేశామని, అయినా ఎవరూ పట్టించుకోలేదని తెలిపారు. తమకు జీతాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాటర్మెన్లు అశోక్, మురళీ, గౌస్బాషా, ప్రబురాజ్, షౌకత్అలి, రమేష్, ఖాదర్వ్య, ఎంఎస్. నజీర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.





# ప్రజాదర్బార్‌కు పోటెత్తిన జనవాహిని



**పులివెందుల,జూన్ 30, ప్రభాత వార్త:**

పులివెందుల పట్టణంలోని స్థానిక ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి నివాసం వద్ద జరిగిన ప్రజాదర్బార్ కి ప్రజలు కార్యకర్తలు పోటెత్తారు. సోమవారం ఎంపీ నివాసం వద్ద ప్రజా దర్బార్ నిర్వహించారు.గత కొన్నిరోజుల క్రితం టీడీపీ జెండాల తొలగించారు అంటూ టీడీపీ నాయకుల పిర్యాదు మేరకు తప్పు చేయని మైనర్ బాలురు సహితం కేసు పెట్టి అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.కోర్టు ద్వారా బెయిల్ పై వచ్చిన బాలురు ఎంపీ అవినాష్ రెడ్డిని కలవగా మీరు అధైర్య పడవద్దు పార్టీ తరుపున అన్ని విధాలుగా ఆదుకుంటాం అని మన ప్రభుత్వం వస్తానే న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలోనీ ప్రతి కార్యకర్త సంక్షేమం కోసం ఎంత త్యాగానికైన సిద్ధమని ఆయన తెలిపారు. కార్యకర్తల సంక్షేమమే తన అజెండా అని అన్నారు. పట్టణంలోని ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి నివాసం వద్ద నిర్వహించిన ప్రజా దర్బార్ కు పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చారు. ఈ సందర్భంగా నాయకులకు కార్యకర్తల సమస్యల విన్న అనంతరం వారితో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా అని అన్ని విధాల వారిని ఆదుకుంటాం అని ఎవరు అధైర్య పడవద్దు అని అన్నారు.రాజారాం ఫౌండేషన్ వారు వారి సమస్యల గురించి ఎంపీ దృష్టికి తీసుకురాగా వాటినీ పరిష్కరించడానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం టీడీపీ నాయకులు ఎక్కడ చూసినా వైసీపీ శ్రేణులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు అని వైసీపీ ప్రభుత్వం వున్నప్పుడు వైసీపీలో చలామణి అయి ప్రభుత్వం పోయిన వెంటనే టీడీపీకి పని చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు అని ఎంపీ కి దృష్టికి పార్టీ కార్యకర్తలు తీసుకురాగా ఇక మీదట వాళ్ల ఆటలు సాగవని మన ప్రభుత్వం వచ్చిన వెంటనే అటువంటి వారికి రెట్టింపు బుద్ధి చెబుతాము అని సంయమనం పాటించమని కోరారు.అలాగే తన కోసం కలవడానికి వచ్చిన ప్రతి ఒక్కరిని కలసి వారి సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి, వేంపల్లి జడ్పిటిసి రవి రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ హాల్ గంగాధర్ రెడ్డి,ఎంపీటీసీ,కౌన్సిలర్లు,నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికి కరపత్రాలు పంపిణీ



**పోరుమామిళ్ల రూరల్, జూన్ 30 ప్రభాతవార్త:**

భారత ప్రధాని నరేంద్ర మోడీ 11 సంవత్సరాల సుపరిపాలన వికసిత్ భారత్ సంకల్పంతో చేస్తున్న అభివృద్ధిని టేకూరుపేట పంచాయతీలో మండల అధ్యక్షులు నారిసెట్టి నాగేంద్ర ఆధ్వర్యంలో ఇంటింటికి కరపత్రాలు ఇచ్చి మోడీ పరిపాలన గురించి వివరిస్తూ. మనమందరం నరేంద్ర మోడీకి భారతీయ జనతా పార్టీకి వెన్నుదన్నుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమణాచారి అసెంబ్లీ కో కన్వీనర్ పందరి, బిజెపి మండల ఉపాధ్యక్షులు కందుకూరు చెన్నయ్య, పోరుమామిళ్ల మండల జనసేన కార్యకర్త తమ్మిశెట్టి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## అర్జీదారుల సమస్యలు సత్వరం పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసిల్దార్ శివకుమార్

**పీలేరు జూన్ 30 ప్రభాతవార్త:**

అర్జీ దారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన ప్రజల సమస్యలు సత్వరం పరిష్కరించాలని తహశీల్దార్ ఎం. శివకుమార్ అన్నారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్లో మొత్తం 9 ఆర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ తెలిపారు. వచ్చిన ఆర్జీలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. రైతులను, ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోరాదన్నారు. హౌసింగ్ కాలనీల్లో ఖాళీలు గుర్తించాలని ఆదేశించారు. మండలంలో జీవో నెంబరు 30 కింద వచ్చిన అర్జీలను సత్వరమే పరిశీలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీలు ప్రసాద్, చంద్రశేఖర్, వీఆర్వోలు సిద్దయ్య, యల్లయ్య, సుధాకర్, కళ్యాణి, రెడ్డి శేఖర్ పాల్గొన్నారు.

## నట్టల నివారణ కార్యక్రమంపై అవగాహన



నట్టల నివారణ పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**కలికిరి జూన్ 30 ప్రభాతవార్త:**

మండలంలో అలకంవారిపల్లె గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ తరపున జరుగుతున్న జీవాలలో నట్టల నివారణ కార్యక్రమాన్ని డా. వి. నీరజ, ఉప సంచాలకులు, పశు సంవర్ధక శాఖ, మదనపల్లె వారు సందర్శించి పురోగతిని సమీక్షించారు. అనంతరం జీవాల పెంపకం దారులతో మాట్లాడుతూ ప్రభుత్వం తరపున అమలౌతున్న ఈ కార్యక్రమం ఈ నెల 26 నుండి జూలై 10 వరకు జరుతుంది అన్నారు. కావున జీవాల పెంపకం దారులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగ పరచుకుని జీవాలను వ్యాధుల బారిన పడకుండా రక్షించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీవాల పెంపకం దారుల కోసం మిని గోకులం పథకం తెచ్చిందన్నారు. ఈ పథకం లో భాగంగా ఆసక్తి ఉన్న రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం డా. కె. వెంకటముని నాయుడు, సహాయ సంచాలకులు, ప్రాంతీయ పశు వైద్యశాల, కలికిరి వారు పెంపకం దారులతో మాట్లాడుతూ మందలో పొట్టేలును క్రమం తప్పకుండా మార్చాలన్నారు. దీని వలన పుట్టే పిల్లల్లో జన్యు లోపాలు నివారించబడతాయి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక సహాయకులు కృష్ణవేణి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## మంచి నీరు ఇలా తాగండి !

**శరీరం చురుకుగా ఉండాలన్నా.. అందమైన మేని సొంతం అవ్వాలన్నా రోజూ తగినన్ని నీటిని తీసుకోవడం తప్పని సరి. ఒకసారి పనిలో పడితే చాలు. తలమున్నకలైపోతారు మనలో చాలామంది. ఇక నీళ్లేం గుర్తుంటాయి. మీరూ ఇదే బాపతా? అయితే ఇలా ప్రయత్నించి చూడండి.**

✦ ఇంట్లో ఉన్నా, ఎక్కడికైనా వెళుతున్నా.. వెంట వాటర్ బాటిల్ తప్పనిసరి అన్న నియమం పెట్టుకోండి. అది కళ్ల ముందు ఉంటే అదే మీకు నీళ్ల తాగాలన్న విషయానినన గుర్తుచేస్తుంది. దాన్నీ గమనించుకోవట్లేదు అనిపిస్తోందా? అయితే ఎన్నిగంటలకు ఎన్ని నీళ్ల తాగాలో సూచించే బాటిళ్ల వస్తున్నాయి. వాటిని కొనుక్కోండి ఫిట్‌నెస్ యాప్‌ని వేసుకుంటే సరి. ఓ రిమైండర్ పెట్టుకుంటే అదే గుర్తుచేస్తూ ఉంటుంది.

✦ అస్లమానూ నీళ్లేతాగాలంటే బోర్ కొట్టడం కాయం. దానిలో నారింజ, నిమ్మ, కీర, ఖర్జూర, ఎండుద్రాక్ష వంటివాటిల్లో నచ్చినవి వేసి ఉంచండి. కావాల్సిన పోషకాలు అందడమే కాదు.. తాగాలనే ఉత్సాహం కలుగుతుంది. మజ్జిగ, పాలు, జ్యూస్, కొబ్బరినీళ్లు.. ఇలా ప్రయత్నించినా మంచిదే.

✦ పుచ్చకాయ, కీర బత్తాయి, నారింజ, వంటి నీరు సమృద్ధిగా ఉండే పండ్లను తీసుకోండి ఇవీ శరీరానికి కావాల్సిన నీళ్లని భర్తీ చేస్తాయి.

## ఎమర్జెన్సీ గురించి మాట్లాడే నైతిక హక్కు మోడీకి, చంద్రబాబుకు లేదు

**వేంపల్లె: జూన్ 30 (ప్రభాత వార్త):**



ప్రధాని మోదీ, బీజేపీ నాయకులు, ముఖ్యమంత్రి చంద్ర బాబు పదే పదే ఎమర్జెన్సీ గురించి ప్రస్తావించటం, ఆ సాకుతో కాంగ్రెస్ ను విమర్శించడం గర్హనీయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. సోమవారం వేంపల్లి లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ తెలుగు ప్రజలు ఎమర్జెన్సీకి బ్రహ్మరథం పట్టారన్నారు. చంద్ర బాబు ఇందిరా కాంగ్రెస్ పార్టీ తరపున చంద్ర గిరి నుండి గెలిచాడన్నారు. దేశంలో పరిస్థితులు బాగా లేని కారణంగా రాజ్యాంగం లోని 352 అధికరణ ప్రకారం రాజ్యాంగ బద్ధంగా ఇందిరమ్మ ఎమర్జెన్సీని ప్రకటించింది. పరిస్థితులు చక్క బడగానే ఇందిరమ్మనే ఎమర్జెన్సీ ఎత్తివేసి ప్రజాస్వామ్య యుతంగా ఎన్నికలు జరిపించిందని తెలిపారు. కానీ ప్రస్తుతం మోడీ పాలనలో 11 ఏళ్లుగా రాజ్యాంగ విరుద్ధంగా అప్రకటిత ఎమర్జెన్సీ అమలవుతోందని. రాజ్యాంగ వ్యవస్థలన్నీ దుర్వినియోగం అవుతున్నాయి. ఎమర్జెన్సీని విమర్శించే నైతిక హక్కు మోడీకి గానీ,చంద్ర బాబుకు గానీ,బీజేపీ నాయకులకు గానీ లేదని తులసి రెడ్డి అన్నారు. మోడీ నాయకత్వం లో బీజేపీ అటు దేశానికి, ఇటు రాష్ట్రానికి శని గ్రహం లా దాపురించింది. 140 లక్షల కోట్ల రూపాయల అప్పు చేసింది. దేశాన్ని అప్పుల భారత్ లా చేసిందన్నారు. రాష్ట్రానికి చెందిన ప్రాంతీయ పార్టీలు టీడీపీ, వైకాపా, జనసేనలు బిజెపి చేతిలో కీలు బొమ్మలు, కబాలీలుగా తయారయ్యాయని అన్నారు. దేశం, రాష్ట్రం బాగుపడాలంటే కాంగ్రెస్ అధికారం లోకి రావాలని పిలుపునిచ్చారు.

## విద్యార్థులకు కౌన్సిలింగ్ ప్రారంభం

**వేంపల్లి: జూన్ 30 (ప్రభాత వార్త):**

ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ లో యుజి అడ్మిషన్స్ 2025 మొదటిరోజు కౌన్సెలింగ్ ప్రక్రియ విజయవంతంగా సాగినట్లు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా వెల్లడించారు. 538 మంది విద్యార్థులకు గాను 481 మంది (34 మంది విద్యార్థులు రేపటి కౌన్సిలింగ్ కి హాజరు కావలసిన వారితో కలిపి) హాజరై ప్రవేశం పొందినట్లు తెలిపారు .ఈ కార్యక్రమాన్ని డైరెక్టర్ కుమారస్వామి గుప్తా ఎంపికైన మొదటి మూడు ర్యాంకుల విద్యార్థులకు ప్రవేశ పత్రాలతో పాటు బహుమతులను ప్రదానం చేసి ప్రారంభించారు. మొదటిరోజు కౌన్సెలింగ్ ప్రక్రియను విజయవంతం చేసినందుకు తగిన ఏర్పాట్లు, వసతులను కల్పించిన అధికారులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏవో రవికుమార్ , డీన్ అకాడమిక్ డాక్టర్ రమేష్ కైలాష్, ఆర్థిక అధికారి కోటేశ్వరి, సాఫ్ట్ వేర్ ఇంజనీర్లు లింగమూర్తి , జ్ఞాన వెంకట్ , అసోసియేట్ డీన్స్ రాఘవరెడ్డి, రఫీ, నవీన్ , క్యాంపస్ మెయింటెన్స్ ఇంచార్జ్ పవన్ కుమార్ , కోఆర్డినేటర్ శ్రీకాంత్ రెడ్డి, పీఆర్వో డాక్టర్ తిరుపతిరెడ్డి, అధ్యాపక అధ్యాపకేతరులు మరియు యన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఎర్రకోటలో తెలుగు మహిళలు

**ఊరి బాగుకోసం, జిల్లా అభివృద్ధి కోసం, సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమించారు. సొంత డబ్బునీ ఖర్చుపెట్టారు. అందుకే ఈ రోజున ఎర్రకోటపై త్రివర్ణ పతాకాన్ని ప్రధాని ఎగరవేయడం మనమంతా టివిల్లో చూసి ఆనందిస్తే.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఈ మహిళలు నేరుగా పాల్గొనే అరుదైన గౌరవాన్ని అందుకున్నారు.**

**మన్యం మెచ్చిన సర్పంచ్..!** అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరుకు సమీపంలో ఉంది మినుములూరు పంచాయతీ. 2021 ఫిబ్రవరిలో లంకెలి చిట్టెమ్మ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. అప్పటికి కొవిడ్ భయం ఇంకా



తగ్గలేదు. దీంతో చిట్టెమ్మ సొంత డబ్బులతోనూ, మన్యంలో సేవలందిస్తున్న ఏకలవ్య ఫౌండేషన్' సహకారంతోనూ 10 టన్నుల నిత్యావసర సరకులు అందజేశారు. ఆ సంస్థ సహకారంతోనే 350 మంది రైతులతో పాడేరు రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేసి అన్నదాతలకు అండగా నిలిచారు. గ్రామంలో 10 కంప్యూటర్లను ఏర్పాటు చేసి స్థానిక యువతకు శిక్షణ ఇప్పించారు. దాతల సహాయంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు సదుపాయాలు కల్పించారు. రైతులకు విత్తనాలు, మొక్కలు పంచిపెట్టారు. మహిళలకు కుట్టు మిషన్లపై శిక్షణ ఇప్పించారు. చిట్టెమ్మ పట్టుదల కృషిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల క్రితం దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయత్ అవార్డును రూ.10 లక్షల నగదు ప్రోత్సాహకాన్ని అందించింది. రాష్ట్ర ప్రభుత్వం మినుములూరును ఉత్తమ పంచా యతీగా గుర్తించింది. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం నుంచి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు హాజరవ్వాల్సిందిగా పిలుపు రావడం చిట్టెమ్మను ఆనందం లో మునిగి తేలేలా చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ముగ్గురు సర్పంచులకు ఈ గౌరవం దక్కగా ఉత్తరాంధ్ర నుంచి చిట్టెమ్మకు ఈ అవకాశం దక్కింది.

**నమ్మకాన్ని నిలబెడతాను..** చదువుకున్నా.. ఉద్యోగం వైపు కాకుండా, గ్రామాభివృద్ధికి అడుగులు వేశారు కవిత. ఈమె అనంతపురం జిల్లా, కళ్యాణదుర్గం మండలం, గోళ్ల గ్రామ పంచా యతీ సర్పంచ్. ఎంఎ తెలుగు పూర్తిచేశారు. భర్త బొజ్జన్న వ్యవ సాయం చేస్తారు. 2021లో సర్పంచ్‌గా గెలుపొందిన కవిత, గ్రామంలో సొంత నిధులతో బోరు మోటర్లు, పైప్‌లైన్ల లీకేజీల మరమ్మతులు, పారిశుద్ధ్య పనులను చేయించారు. కేరళలో 2022 జులైలో దేశ స్థాయిలో జరిగిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల కార్యక్రమానికి గోళ్ల పంచాయతీ కార్యదర్శి హేమలత హాజరయ్యారు. 2022-23 సంవత్సరంలో ఉత్తమ పంచాయతీగానూ ఈ గ్రామం ఎంపికైంది. అంతేకాదు, కేంద్ర ప్రభు త్వం



రూ.50వేలు నగదు బహుమతినీ అందించింది. ఈ నెల 15న న్యూఢిల్లీ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు కవిత 20 నెలల బిడ్డ రుద్విన్‌తో సహా పాల్గొన్నారు. సర్పంచ్‌గా గెలిపించిన



ప్రజల నమ్మ కాన్ని వమ్ము చేయకుండా పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తున్నాను. ఈ ఆహ్వానం రావడం ఎంతో సంతోషంగా ఉంది అంటున్నారు. 34 ఏళ్ల కవిత.

**చిన్ననాటి కోరిక.....**

విశాఖకు చెందిన వడిసెల లిఖిత సెయింట్ జోసఫ్ కళాశాలలో బిఎ చివరి ఏడాది చదువుతోంది. అమ్మ భాగ్యలక్ష్మి, నాన్న ఉమామహేశ్వర కొండలరావు కారు డ్రైవర్. తాతయ్య ప్రొఫెసర్ బి.ప్రసాదరావు ప్రోత్సాహంతో పాఠశాల స్థాయి నుంచి చదువుతో పాటు సామాజిక, సేవా కార్యక్రమాల్లోనూ చురుగ్గా ఉండేది. నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ (ఎన్‌వైకెఎస్) ఆధ్వర్యంలో ర్యాలీలు, తీరప్రాంత పరిశుభ్రతతో పాటు నేవీ, ఇతర మారథాన్‌లలో వలంటీర్‌గా ఉండేది. ఇటీవల విశాఖలో నిర్వహించిన జిల్లా యూత్ పార్లమెంట్‌లో తొలి స్థానంలో నిలిచింది. రాష్ట్రస్థాయిలో విశాఖ తరఫున పాల్గొని మేకిన్ ఇండియా.. విశ్వగురు అనే అంశంపై మాట్లాడి అందరి ప్రశంసలు పొందింది లిఖిత. చిన్నప్పటి నుంచీ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనాలనే కోరిక ఉండేది. ఎన్‌వైకెఎస్ ద్వారా మైభారత్ పోర్టల్ లో నమోదు చేసుకున్నా. అనూహ్యగా స్వాతంత్ర్య వేడుక లకు ప్రత్యేక అతిథిగా ఆహ్వానం అందింది. వేడుకల్లో నేరుగా పాల్గొంటానని ఎప్పుడూ ఊహించ లేదు. చాలా సంతోషంగా ఉంది అంటోంది 20 ఏళ్ల లిఖిత.

# పార్టీ కోసం కష్టపడ్డ వారికి సముచిత స్థానం

**రాజంపేట, జూన్ 30 ప్రభాతవార్త**

పార్టీ నియమావళికి అనుగుణంగా కష్టపడి పని చేయండి. క్రమశిక్షణకు వాటికోసం పనిచేసిన వారికి,కష్టపడ్డ వారికి సముచిత స్థానం తప్పక దక్కుతుందనీ రాజంపేట అసెంబ్లీ ఇంచార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు అన్నారు. తెలుగుదేశం పార్టీ నియమావళికి కష్టపడి పని చేసి పార్టీ నియమ నిబంధనలకు క్రమశిక్షణకు కట్టుబడి ప్రతి కార్యకర్త రాజంపేటలో టిడిపిని బలోపేతం చేస్తూ సంస్థాగత ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పించేలా చర్యలు చేపట్టాలని రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు సూచించారు. సోమవారం రాజంపేట టిడిపి కార్యాలయంలో సంస్థాగత ఎన్నికలకు సంబంధించి రాజంపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అబ్జర్వర్ చిట్టి బాబు, ఎన్నికల అబ్జర్వర్ కిరణ్ కుమార్ లతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా



ఆయన మాట్లాడుతూ కష్టపడ్డ కార్యకర్తలకు, సమర్థవంతమైన నాయకులకు సంస్థాగత ఎన్నికలలో అందరి ఆమోదంతో అవకాశం కల్పించాలని కోరారు .భవిష్యత్తులో టిడిపి బలోపేతమే లక్ష్యంగా సంస్థాగత ఎన్నికలను చేపట్టాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో రాజంపేట టిడిపి అధ్యక్షుడు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు, గన్నె సుబ్బ నరసయ్య నాయుడు, భాను గోపాల్ రాజు, కల్లే రెడ్డప్ప, జంగం శెట్టి సుబ్బయ్య, గజ్జల నరసింహారెడ్డి, శనివారపు మోహన్ రెడ్డి, క్లస్టర్ ఇన్చార్జులు దశరథ నాయుడు, పసుపులేటి ప్రవీణ్, కొల్లి రెడ్డయ్య నాయుడు, పలువురు టిడిపి అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు .

# వేషం మార్చుకొని క్రీడపై పట్టు..



**హరియాణా.. ఆడపిల్లలపై ఆంక్షలు ఎక్కువగా ఉండే రాష్ట్రమిది. అమ్మాయిలు చదువుకోకూడదు. ఆటల్లో రాణించకూడదు అనే నియమాలు ఉంటాయిక్కడ. అయినా సమాజాన్ని ఎదిరించి తనకు నచ్చిన క్రీడలో రాణించాలనుకుందో అమ్మాయి, ఆడపిల్ల అంటూ ఆట నేర్పడానికి నిరాకరిస్తే.. అబ్బాయిలా వేషం మార్చుకొని మరీ క్రీడపై పట్టు పెంచుకుంది. ఈ పట్టుదలే ఇప్పుడు ఆమెను ప్రపంచంలోనే ది బెస్ట్ విమెన్ క్రికెటర్లలో ఒకరిగా నిలబెట్టింది. రెండు పదుల వయసులోనే భారతీయ మహిళల క్రికెట్‌లో సంచలనంగా మారిన షఫాలీ వర్మ. తాజాగా మరో అరుదైన మైలురాయిని అందుకుంది. టెస్టుల్లో అత్యంత వేగంగా డబుల్ సెంచరీ చేసిన తొలి మహిళా క్రికెటర్‌గా చరిత్రకెక్కిందామె. మిథాలీ తర్వాత ఈ ఘనత సాధించినరెండో భారతీయ మహిళా క్రికెటర్‌గా నిలిచింది షఫాలీ. ఈ నేపథ్యంలో ఈ యువ మహిళా ప్లేయర్ గురించి కొన్ని ఆసక్తికర విశేషాలు తెలుసుకుందాం..**

ఒక మ్యాచ్.. రెండు ఘనతలు... చెన్నైలోని ఎంఎ చిదంబరం స్టేడియంలో భారత్-దక్షిణాఫ్రికా మహిళా జట్ల మధ్య తొలి టెస్ట్ మ్యాచ్ జరుగుతోంది. ఇందులో భాగంగా ఓపెనర్ షఫాలీ వర్మ తన అద్భుత బ్యాటింగ్ విన్యాసంతో ప్రత్యర్థిపై విరుచుకుపడింది. ఆట మొదలైన తొలి రోజే 197 బంతుల్లో 205 పరుగులు చేసి.. టెస్టుల్లో అత్యంత వేగంగా డబుల్ సెంచరీ చేసిన తొలి మహిళా క్రికెటర్‌గా ఆవిర్భవించింది షఫాలీ. అంతేకాదు.. మిథాలీ రాజ్ తర్వాత ఈ ఘనత సాధించిన రెండో భారతీయ మహిళా క్రికెటర్‌గానూ నిలిచిందీ యంగ్ క్రికెటర్. 22 ఏళ్ల క్రితం మిథాలీ ఇంగ్లండ్‌పై 407 బంతుల్లో 214 పరుగులు చేసింది. అయితే ప్రస్తుత టెస్టులో షఫాలీకి జత కలిసిన స్మృతి కూడా 149 పరుగులతో విజృంభించడంతో మన జట్టు ఒక్క రోజులోనే 525 పరుగులు చేసింది. ఇలా టెస్టుల్లో ఒక్క రోజులో ఎక్కువ పరుగులు చేయడం కూడా మహిళల టెస్టు క్రికెట్లో ఒక రికార్డు కావడం మరో విశేషం. గత మూడు వన్డేల్లో పెద్ద స్కోర్లు సాధించలేక పోయా. కానీ ఈ మ్యాచ్‌కు ముందు నా బలాబలాల్ని ఓసారి పునశ్చరణ చేసుకున్నా. ఇవే నేను డబుల్ సెంచరీ చేసే శక్తినిచ్చాయి. రోజంతా ఆడాలనుకున్నా.. ఆడాను! అంటూ తన బ్యాటింగ్ సీక్రెట్‌ని బయటపెట్టిందీ యువ బ్యాటర్.

**అబ్బాయిలతో కలిసి ఆడా !..** మనసు పెట్టి చేసే ఏ పనైనా మనకు జీవితాన్నిస్తుంది. చిన్నతనం నుంచి నేను నమ్మే సిద్ధాంతమిదే! నిజానికి క్రికెట్‌లోకి రావాలని కానీ, వస్తానని కానీ నేను ఎప్పుడూ అనుకోలేదు. కానీ నా పదేళ్ల వయసులో మా సొంతూరు రోహ్‌తక్‌లో కొంతమంది అబ్బాయిలు క్రికెట్ ఆడడం చేశా. వాళ్లు కొట్టే బౌండరీలు చూస్తుంటే నాకు ముచ్చటేసింది. ఎలాగైనా ఈ ఆట నేర్చుకోవాలనిపించింది. కానీ మా ప్రాంతంలో అమ్మాయిల్ని ఇలాంటి ఆటలు ఆడనిచ్చే వారు కాదు. అయినా ధైర్యం చేశా. నా మనసులోని కోరికను మా నాన్నతో పంచుకున్నా. తనూ ప్రోత్సహించాడు. భారత మహిళల జట్టులో చోటు సంపాదించాలంటే నీకంటూ ఓ ప్రత్యేకత ఉండాలి. అదే నీకు అవకాశాలు తెచ్చిపెడుతుంది. అంటూ వెన్నుతట్టాడు. నాన్న మాటలు నాలో మరింత స్ఫూర్తి నింపాయి. ఈ క్రమంలోని నాకు ఇష్టమైన బ్యాటింగ్‌పై దృష్టి పెట్టా. అయితే ఆ సమయంలో రోహ్తక్‌లో అమ్మాయిల కోసం ప్రత్యేకంగా తరగతులు లేకపోవడం, ఆడప్లిలకు ఈ క్రీడలో ట్రైనింగ్ ఇవ్వడానికి నిరాకరించడంతో అబ్బాయిగా వేషం మార్చుకొని అబ్బాయిలతో క్రికెట్ సాధన చేసేదాన్ని.

**జుట్టు కత్తిరించుకున్నా!** నేను చిన్నతనం నుంచే ఎత్తు ఎక్కువగా ఉండేదాన్ని. క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకునే క్రమంలో ఇది కూడా నాకు బాగా కలిసొచ్చింది. అంతేకాదు.. మొదట్లో నాజుట్టు చాలా పొడవుగా ఉండేది. నడుస్తుంటే నా నడుమును తాకే నాజుట్టును చాలా ఇష్టపడేదాన్ని కానీ అబ్బాయిలతో ఆడే క్రమంలో ఇదే నాకు అడ్డుగా అనిపించింది. అందుకే జుట్టు కత్తిరించుకున్నా. ఆ సమయంలో ఇది నా గుర్తింపును దాచి ఉంచడమే కాదు.. ఆడే క్రమంలో సౌకర్యాన్నీ అందించింది. అందుకే అప్పట్నుంచి ఇదే హెయిర్ స్టైల్‌ని కొనసాగిస్తున్నా. జుట్టు విషయంలోనే కాదు. నా వేషాన్నీ అబ్బాయిలా



మార్చుకున్నా. మొదట్లో నా డ్రస్సింగ్ చూసి కొంతమంది వింతగా చూసేవారు. ఎవరెలా చూసినా, ఎమనుకున్నా నాకు నచ్చినట్లుగా నేను ఉండాలనుకున్నా. ఈ మనస్తత్వమే నాకు నచ్చిన రంగంలో నన్ను నిలబెట్టంది. ఇక ట్యాటూలంటే నాకు చాలా ఇష్టం. మొదట్లో అమ్మానాన్న ఏమంటారోనన్న భయంతో దుస్తులు కవరయ్యే ప్రదేశాల్లో మాత్రమే ట్యాటూలు వేయించుకునేదాన్ని కానీ ఆ తర్వాత నా ఇష్టాని మా ఇంట్లో వాళ్లా గౌరవించడంతో మరిన్ని ట్యాటూలు వేయించుకున్నా

**అప్పడంతా మారిపోయింది !!...** ఆడపిల్లలన్న కారణంతో చిన్నతనంలో సమాజం నుంచి ఎంతో వివక్షను ఎదుర్కొన్నా. క్రికెట్‌లోకి వస్తానన్నప్పుడూ చాలామంది నన్ను నిరుత్సాహ పరచాలని చూశారు. కానీ నేను మాత్రం వెనక్కి తగ్గలేదు. మా నాన్న చిన్న జ్యూయలరీ షాప్ నడిపేవారు. మొదట్లో ట్రైనింగ్ కోసం, పోటీల్లో పాల్గొనడానికి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చినప్పుడు ఆర్థికంగా పలు సవాళ్ల ఎదురయ్యాయి. అయినా నాన్న ప్రోత్సాహంతో ముందుకు సాగాను. ఫిట్‌నెస్ కోసం రోజూ రొట్టె సబ్జీ తప్పకుండ తీసుకునేదాన్ని. నడక, పరుగు, జాగింగ్, వంటి వ్యాయామాలు చేసేదాన్ని. ఈ కష్టానికి ప్రతిఫలంగా నా 15 ఏళ్ల వయసులో భారతహిళల జట్టులో చోటు దక్కింది. అన్ని ఫార్మాట్లలో కలిపి అతి పిన్న వయసులో భారత దేశానికి ప్రాతినిథ్యం వహించిన తొలి క్రీడాకారిణిని కూడా నేనే అని గర్వంగా చెబుతా. నేను ఆటలో రాణించడం చేశాక మా ఊళ్లో నన్ను చూసే దృష్టి కోణం మారింది. నన్ను ఈ క్రీడలోకి వద్దన్న వారే. ఇప్పుడు తమ కూతుల్లకు నన్ను స్ఫూర్తిగా తీసుకోమని సలహా ఇస్తుంటే సంతోషంగా అనిపి స్తుంటుంది. ఏదేమైనా గతేడాది అండ్-19 టి 20 మహిళల ప్రపంచకప్ నెగ్గడం, ఆ జట్టుకు నేను కెప్టెన్‌గా వ్యవహరించడం మర్చిపోలేని అనుభూతి. ఆ సమయంలో నన్ను అభినందించడానికివచ్చిన అతిథులతో మా ఇల్లు నిండిపోయింది, అది చూసి మా అమ్మానాన్నల హృదయం ఉప్పొంగింది. ఒక కూతురిగా నాకు అంతకంటే ఇంకేం కావాలి.!

## ప్రజల వద్దకే పాలన

### ఇంటి వద్దకే సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ



ఓబులవారిపల్లి జూన్ 30 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజల వద్దకే పాలన అందిస్తుందని రైల్వేకోడూరు శాసనసభ్యులు ప్రభుత్వ విప్పు అరవ శ్రీధర్, కుడా చైర్మన్ టిడిపి ఇన్చార్జ్ ముక్కారూపానంద రెడ్డి సతీమణి వరలక్ష్మిలు సూచించారు. సోమవారం మండల పరిధిలోని మంగపేట చెన్నరాజుపోడు ముక్కవారిపల్లి చిన్న వూరుపాడు ఓబులవారిపల్లి గ్రామాల్లో పర్యటించి 8 మంది లబ్ధిదారులకు దాదాపు 6,68,786 ఆర్థిక సహాయాన్ని సీఎం సహాయనిధి ద్వారా ప్రజల వద్దకే వెళ్లి అందించడం ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు జోగినేని మనీ వాసుదేవ రెడ్డి రామచంద్రా రెడ్డి అధికారులు, ఎస్ఐ మహేష్, పోలీస్ సిబ్బంది పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాలు వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు విక్రయాలు



రామాపురం జూన్ 30, ప్రభాతవార్త

ప్రకృతి వ్యవసాయ ఆహారాన్ని ఎంతో రుచిగాను ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది అని APM దేవసేన అన్నారు. DPM వెంకట మోహన్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం రామాపురం మండలంలో MPDO కార్యాలయం దగ్గర ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు స్టాల్ ఏర్పాటు చేసి అనేక రకాల ఉత్పత్తులను కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు తీసుకొని వచి స్టాల్ ఏర్పాటు చేసి దేవసేన మాట్లాడుతూ ఈ ఉత్పత్తులను అందరూ సద్వినియోగం చేసుకోవాలి అని తెలియచేశారు. మధుకర్ లీగి, రవీంధ్ర గౌడ్ మార్కెటింగ్ మాట్లాడుతూ మండలంలో ప్రతి గ్రామం లోనూ రైతులు స్టాల్ ఏర్పాటు చేసుకోవాలని తెలియచేశారు. అదేవిదంగా ప్రతి సోమవారం స్టాల్ ఏర్పాటు చేస్తామని, ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి యూనిట్ ఇంచార్జీ వెంకట్రామి రెడ్డి, రెడ్డమ్మ, సుధాకర్, కదిరినుషా, ICRP లు మరియు రైతులు పాల్గొనడం జరిగింది

## పేద విద్యార్థులకు అభ్యసన సామాగ్రి పంపిణీ



రామాపురం జూన్ 30, ప్రభాతవార్త

మండలంలోని హసనాపురం పంచాయతీ వడ్డేపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రాయచోటి లైన్స్ క్లబ్ అధ్యక్షుడు శివారెడ్డి ఆర్థిక సహాయంతో సోమవారం నోటు పుస్తకాలు పెన్సిల్లు పెన్నులు స్కేల్స్ రబ్బర్లు పంపిణీ చేశారు ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ 25పేద విద్యార్థులకు అభ్యసన సామాగ్రిని పంపిణీ చేయడం సంతోషాన్ని ఇస్తుందన్నారు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంగల్ రెడ్డిమాట్లాడుతూ మారుమూల గ్రామంలోని పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు రాయచోటిలయన్స్ క్లబ్ అధ్యక్షుడు శివారెడ్డి అభ్యసన సామాగ్రిని వితరణ చేయడం సంతోషంగా ఉందన్నారు ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ రాయచోటి కార్యదర్శి షేక్ ఇందాద్ అహ్మద్ ఆవటాల వెంకట్రామిరెడ్డి పాఠశాల సహాయక ఉపాధ్యాయుడు మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర నూతన అధ్యక్షులు పివిఎన్ మాధవ్‌ను సత్కరించిన పోతుగుంట

(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త )



విజయవాడలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో సోమవారం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నంద్యాల జిల్లా ఇంచార్జ్ పోతుగుంట రమేష్ నాయుడు నూతన రాష్ట్ర అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన పివిఎన్ మాధవ్‌ను శాలువాతో సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పివిఎన్ మాధవ్ ఏబీవీపీలో విద్యార్థి నాయకుడిగా, బీజేవైఎంలో యువ నాయకుడిగా పార్టీలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, ఎమ్మెల్సీగా ప్రస్తుతం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బిజెపికి విశేష సేవలు అందించాలన్నారు. పార్టీ నిబద్ధత పట్ల క్రమశిక్షణతో అంకుటిత దీక్షతో పని చేస్తున్న ఒక సాధారణ కార్యకర్తను రాష్ట్ర అధ్యక్షులుగా బిజెపి అధిష్టానం ఎన్నుకోవడం మంచి శుభ పరిణామన్నారు. పివిఎన్ మాధవ్ మరియు పోతుగుట రమేష్ నాయుడు ఏబీవీపీలో నుండి కలిసి పని చేస్తున్నారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకుడు నూతన రాష్ట్ర అధ్యక్షుడు అవ్వడం చాలా అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ జిల్లా ఇంచార్జ్ నర్సింగరావు పాల్గొన్నారు.

## తంబళ్లపల్లె ఎస్ఐని సన్మానించిన టిడిపి నేతలు

తంబళ్లపల్లె జూన్ 30 ప్రభాతవార్త ః

పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఉమామహేశ్వర్ రెడ్డిని టిడిపి నేతలు ఘనంగా సన్మానించారు. సోమవారం ఉదయం రాష్ట్ర టిడిపి బీసీ ఉపాధ్యక్షుడు తులసీదర్ నాయుడు, యువగళం నేత బాలాజీ, అన్నగారిపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగేంద్ర నాయుడుల ఆధ్వర్యంలో ఎస్సై ఉమామహేశ్వర్ రెడ్డిని దృశ్యాలువ, పూల బొకేతో ఘనంగా సన్మానించారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల కృషిని కొనియాడుతూ మండలం నేర రహిత ప్రాంతంగా చేయడానికి సహకరించాలని కోరగా ఎస్సై స్పందిస్తూ అందరి సహకారంతో తంబళ్లపల్లి మండలంలో శాంతిభద్రతల పరిరక్షణపై తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సన్మాన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవిచంద్ర నాయుడు, జైపాల్ నాయుడు, కుమార్ నాయుడు, మండల వికలాంగుల సంఘం అధ్యక్షుడు రామాంజులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మున్సిపల్ కమిషనర్, తహసిల్దార్లకు సమ్మె నోటీస్



(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)

రేపు నెల 9వ తేదీన దేశవ్యాప్త కార్మిక సంఘాల సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు సోమవారం రాజంపేట మున్సిపల్ కమిషనర్, తహసిల్దార్‌లకు సమ్మె నోటీసు ఇవ్వడం జరిగినది. మా న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కొరకు రేపు నెల 9వ తేదీన కార్మిక సంఘాల పిలుపుమేరకు సభలో పాల్గొంటాం. మేము అందరం కూడా డ్యూటీలకు ఆరోజు రాలేమని మేము మీకు నోటీసు ద్వారా తెలియపరుస్తున్నాం. కనీస వేతనం 26,000 అమలు చేయాలని, ప్రభుత్వ రంగ సమస్యలను కాపాడాలని, ప్రవేటికలను రద్దు చేయాలా లేబర్ కోడ్ చట్టాన్ని రద్దు చేయాలా ఈ డిమాండ్ల పరిష్కారం కొరకు సమ్మె చేస్తున్నాం ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేల్ రవికుమార్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రమణ లక్ష్మీదేవి ప్రసాదు ఎమ్మార్వో ఆఫీస్ దగ్గర విఆర్ఏ సంఘం నాయకులు శంకర్ సుబ్రమణ్యం రమణయ్య భాష తదితరులు పాల్గొన్నారు.

## శక్తి యాప్ మహిళలకు శ్రీరామరక్ష



మైదుకూరు, జూన్ 30, ప్రభాతవార్త:

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణ రెడ్డి అధ్యక్షతన మహిళల భద్రత మరియు హక్కులపై అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మైదుకూరు అర్బన్ సీఐ ఇదురు భాష ముఖ్య అతిథిగా హాజరై శక్తి యాప్ ఉపయోగాలు, మహిళల రక్షణకు ఇది ఎంతగానో దోహద పడుతుందనే విషయాన్ని విద్యార్థులకు వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్ ఎలా పనిచేస్తుందో ప్రాక్టికల్ డెమో ద్వారా వివరించారు. అలాగే మహిళల హక్కులు, సంబంధిత చట్టాలు, వాటి అమలు ప్రక్రియపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు అర్బన్ ఎస్సై సుబ్బారావు, వైస్ ప్రిన్సిపల్ శుభాన్ సాహెబ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. పి.వి.కృష్ణారెడ్డి, ఆంగ్ల విభాగ అధ్యాపకులు రాధారాం మరియు ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## సుపరిపాలనలో తొలి అడుగు

కడప, జూన్ 30 ప్రభాతవార్త :



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారంగా మేనిఫెస్టోలో చెప్పిన ప్రకారంగా ప్రతి ఒక్కటి ప్రజల దగ్గర తీసుకెళ్తూ ప్రజాభీష్టం మేరకే పరిపాలన చేస్తున్న దేశంలో ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబుని గాజుల ఖాదర్ బాషా పేర్కొన్నారు. సోమవారం మంత్రి క్యాంపు కార్యాలయం నందు సుపరిపాలన తొలి అడుగు శిక్షణ కార్యక్రమంలో గాజుల ఖాదర్బాషా మాట్లాడుతూ తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ తల్లి ఖాతాలలో ఒక్కొక్కరికి రూ, 13000 మరియు 2000 రూపాయలు స్కూల్ డెవలప్మెంట్ కింద అందించిన ఘనత చంద్రబాబు నాయుడుకి దక్కుతుందన్నారు. రైతులకు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తూ రైతు భరోసా కింద కేంద్ర సహాయంతో ప్రతి రైతుకు సంవత్సరానికి 20000 రూపాయలు త్వరలో ఇవ్వబోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చన స్కూల్ అధినేత మదనమోహన్ రెడ్డి గారు విష్ణువర్ధన్ రెడ్డి బసిరెడ్డి జయరాం రెడ్డి శివారెడ్డి రాష్ట్ర తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి నూడివీడు శివారెడ్డి మాజీ జెడ్పిటిసి ఆనంపల్లి రాంప్రసాద్ రెడ్డి మాజీ సర్పంచ్ నాగేశ్వర్ నాయుడు రోఫా అబ్బవరం సుబ్బయ్య సయ్యద్ హబీబ్ ఖాదర్ మొహిద్దీన్ రఫీ నాయుడు జరామిరెడ్డిమరియు బూత్ ఇన్చార్జీలు క్లస్టర్ ఇన్చార్జీలు యూనిట్ ఇన్చార్జులు తెలుగుదేశం పార్టీ నాయకులు కుటుంబ సారథులు మైనార్టీ నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జగన్మాత ఈశ్వరీదేవి మఠంలో హుండీలు లెక్కింపు



బ్రహ్మంగారిమఠం జూన్ 30 ప్రభాతవార్త ః

జగన్మాత శ్రీ ఈశ్వరీదేవి మఠం నందు హుండీలలోని భక్తులు సమర్పించిన కానుకలు లెక్కింపు ప్రక్రియను మఠాధిపతులు శ్రీ వీరశివకుమారస్వాముల వారి ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ లెక్కింపు లోభక్తులు సమక్షంలో, దేవాదాయ శాఖ రాజంపేట తనిఖీ అధికారి జనార్దన్ మరియు కార్యనిర్వహణాధికారి బి.వి.జగన్ మోహన్ రెడ్డి సంయుక్త పర్యవేక్షణలో, APG బ్యాంకు సిబ్బంది మరియు మఠం సిబ్బంది, భక్తులు ఈ హుండీ కానుకలును లెక్కించారు. నాలుగు నెలలకుగాను హుండీ కానుకలు ద్వారా 5,01,333 లు మఠానికి ఆదాయం వచ్చినట్లు మఠం మఠాధిపతి శివకుమార్ స్వామి తెలియజేశారు.

## ఆలయ పునర్నిర్మాణానికి రూ.10 లక్షలు వితరణ

యర్రగుంట్ల జూన్ 30 ప్రభాతవార్త

మండల పరిధిలోని కోడూరు గ్రామంలో 200 సంవత్సరాల పైగా చరిత్ర కలిగిన అగస్త్యేశ్వర లింగేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి గ్రామ పెద్దలు ప్రజలు శ్రీకారం చుట్టారు. ఆలయ నిర్మాణానికి తమ వంతు సహకారంగా గ్రామానికి చెందిన రామిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు 5లక్షలు రూపాయలు, కొత్తపు శ్రీనివాసరెడ్డి 5 లక్షల రూపాయలను విరాళంగా సోమవారం ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామ పెద్దలకు అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మల్లు గోపాల్ రెడ్డి మాట్లాడుతూ అత్యంత చరిత్ర కలిగిన అగస్త్యేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి దాతలు సహకరించడం ఎంతో ఆనందంగా ఉందని ఆలయ పనులు శరవేయంగా జరుగుతున్నాయని తెలిపారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రంగారెడ్డి రామచంద్రారెడ్డి హరీష్ రెడ్డి సర్పంచ్ వాసుదేవరెడ్డి మాజీ సర్పంచ్ శివారెడ్డి గ్రామ పెద్దలు పురుషోత్తం రెడ్డి అంకిరెడ్డి గోపాల్ రెడ్డి గోవర్ధన్ రెడ్డి శివారెడ్డి పాల్గొన్నారు.



## కొటాలలో దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు

తంబళ్లపల్లె జూన్ 30 ప్రభాతవార్త ః

తంబళ్లపల్లె మండలం కొటాల సంత తోపు సమీపంలో శ్రీ షిరిడి సాయి బాబా ఆలయ ప్రాంగణంలోని దేవతామూర్తులకు సోమవారం ఆలయ ధర్మకర్తలు అల్లూరి మంజునాథ స్వామి, శ్రీలత దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని కాశీ విశ్వేశ్వర స్వామి, వినాయక స్వామి, విరూపాక్షమ్మ, నందీశ్వరుడు, ఆంజనేయ స్వామి విగ్రహాలకు ప్రత్యేక పుష్పాలంకరణ, ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, ఆకు పూజ, ధూప దీప నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమానికి కొట్టాల పంచాయతీ లోని మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## ప్రజలు, రైతులతో మమేకమైన శ్రీకాంత్ రెడ్డి



రామాపురం జూన్ 30 ప్రభాతవార్త

రామాపురం మండలం నీలకంతరావుపేట ప్రజలు, రైతులతో సోమవారం వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి మమేకమయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలను పేరుపేరునా ఆప్యాయంగా శ్రీకాంత్ రెడ్డి పలకరించి, వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా తీవ్ర త్రాగునీటి ఎద్దడి నెలకొనిఉందని మహిళలు, ప్రజలు దృష్టికి తీసుకు రావడంతో సొంత డబ్బులతో బోరు వేయిస్తానని శ్రీకాంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన ఖాజా హుసేన్, అనారోగ్యంతో బాధపడుతున్న అబ్దుల్ హుసేన్, మెకానిక్ దర్బార్‌లను శ్రీకాంత్ రెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్తితులడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## మల్లయ్య కొండ శివాలయంలో భక్తుల కిటకిట

తంబళ్లపల్లె జూన్ 30 ప్రభాతవార్త ః

తంబళ్లపల్లె మండల కేంద్రం సమీపంలోని మల్లయ్య కొండ శివాలయం సోమవారం వందలాది భక్తుల తో కిటకిటలాడింది. ఉదయం మహాశివునికి ఆలయ అర్చకులు ఈశ్వరప్ప, మల్లికార్జున స్వాములు ప్రత్యేక పుష్పాలంకరణ, ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, ధూప దీప నైవేద్యాలు, కర్పూర హారతులు సమర్పించారు. భక్తులు మహా శివుని దర్శనం తో పాటు కొండపై వెలసిన గౌరీ మాత ఆలయం, వీరన్నగెవి, నిచ్చెన కొండ, భగీరథి, ఎలకతీర్థం తో పాటు వెలుగు మల్లమ్మ ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు టెంపుల్ రికార్డ్ అసిస్టెంట్ కొండ కిట్ట సిబ్బంది సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

## గ్రామ కమిటీ అధ్యక్షుల ఎంపిక

పెద్దమండెం జూన్ 30 ప్రభాతవార్త

మండలంలోని ఆరు పంచాయతీలలో మంగళవారం అబ్జర్వర్ డి శ్రీనివాసులు ఆధ్వర్యంలో మండల గ్రామ కమిటీ ల ఎన్నికలు మధ్యాహ్నం రెండు గంటల నుండి నిర్వహించడం జరుగుతుందని మండల అధ్యక్షుడు జిట్టా రమణ తెలిపారు. సిద్దవరం శివపురం కల్చర్ల కోటకాడపల్లి గుర్రమాలపల్లి పెద్దమండెం శ్రీ గొల్లపల్లిలో గ్రామ కమిటీల అధ్యక్షులు కార్యదర్శులు కమిటీ సభ్యులు ఎంపికను నిర్వహిస్తామని అందుకు గ్రామాల్లోని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొని ఎంపికను సజావుగా చేసుకోవాలని కోరారు గ్రామాల్లో అర్హులు అయినటువంటి వారిని ఎంపిక చేసుకోవాలని సూచించారు ఈ సమావేశాల్లో ప్రతి ఒక్కరు పాల్గొని ఎంపికను చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## సెమిస్టర్ ఫలితాలలో సత్తా చాటిన వేదవ్యాస విద్యార్థులు



ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 30 ప్రభాతవార్త :

యోగి వేమన యూనివర్సిటీ డిగ్రీ సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో శ్రీ వేద వ్యాస డిగ్రీ కాలేజి విద్యార్థి, విద్యార్థినులు యూనివర్సిటి స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచారని కరస్పాండెంట్ ఎల్. నాగేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రెండవ సెమిస్టర్ బియస్సీ విభాగంలో బి. లోకేశ్వర్ 9.75, టి. మానస 9.42, యు. షేక్ లైబా 9.42, సి. సూర్య ప్రకాష్ యాదవ్ 9.00, పి. సుబ్బమ్మ 9.00, బి. కామ్ విభాగంలో ఎస్. సాబీనా బీ 9.42, సి. అనిత 9.25, ఎస్. రబియా 9.25, జి.హరిత 9.17, ఎస్.నౌజియా 9.17, ఎస్. షిరీన్ 917,4 వ సెమిస్టర్ ఫలితలలో బీయస్సీ విభాగంలో యు. కీర్తన 9.40, వి. మన్విత రెడ్డి 9.40, కె. ఎస్. సాజిద రెహమాని 9.15, టి. అమృత వర్షిణి 9.15, ఎస్. మెహనూర్ భాను 9.05, బీ కామ్ విభాగంలో ఆర్. అపర్ణ 9.25, కె. పూజిత 8.85, ఎం. అభినయ 8.85, కె.కరిష్మా 8.85, పి. భారతి 8.65 సాధించారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రెసిడెంట్ జి.సుదర్శన రెడ్డి, యన్.యస్.యస్ కోఆర్డినేటర్ రామలక్ష్మిరెడ్డి, నాగరాజ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

## అహర్నిశలు పాటుపడిన వ్యక్తి శివారెడ్డి



బద్వేలు అర్బన్, జూన్ 30, ప్రభాతవార్త

పేదల శ్రేయస్సుకై అహర్నిశలు పాటుపడిన గొప్ప వ్యక్తి పుత్తా శివారెడ్డి అని, ఆయన హఠాత్తుగా మరణించడం బాధాకరమని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు పేర్కొన్నారు. సోమవారం పలువురు ప్రజాసంఘాల నాయకులు ఆయన మరణానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివారెడ్డి బడుగు, బలహీన వర్గాల కోసం అణగారిన ప్రజల కోసం నిరంతరం ప్రజా పోరాటంలో కొనసాగిన ప్రజా సేవకుడు అని ఆయన పేద ప్రజల పక్షాన నిరంతరం పోరాడేటువంటి వ్యక్తి అని పార్టీలకు అతీతంగా ఆయన సేవ మరిచిపోలేనిదని కొనియాడారు. రైతుల పక్షాన వారి హక్కుల కోసం శ్రమించిన వ్యక్తి రెండు తెలుగు రాష్ట్రాలలో స సుపరిచితుడు మొదటిగా పుత్తా శివారెడ్డి స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ప్రజలు ప్రజలతో మమేకమై తర్వాత అనేక ప్రజా సంఘాలలో పౌరహకుల సంఘం లోను రైతు సంఘంలోనూ బడుగు బలహీన వర్గాల పక్షాన అలాగే వామపక్షాల తరుపున సమస్య ఉంది అని అంటే వెనుకడుగు వేయకుండా ఆ సమస్య పరిష్కారం అయ్యేంతవరకు నిస్వార్థంగా నిరాడంబరంగా బాధితుల పక్షాన పోరాడిన ప్రజా పోరాట యోధుడన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ దళిత నాయకులు ప్రసాద్, సామాజిక చైతన్య సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు చంద్రశేఖర్, నియోజకవర్గ నాయకులు తిరుమల చంద్ర, డిహెచ్ పీ ఎస్ జిల్లా అధ్యక్షులు నాగదాసరి ఇమ్మానియేలు, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరమణ, పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి ముండ్లపాటి పిచ్చయ్య, సీనియర్ దళిత నాయకులు బత్తుల కూరి కేశవయ్య, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా కడప జిల్లా కార్యదర్శి శ్రీనివాస వర్మ, తదితరులు పాల్గొని సంతాపాన్ని తెలియజేశారు

## మండల ఎంపిడిఓ భానుప్రసాద్ బదిలీ

రామసముద్రం జూన్ 30 ప్రభాతవార్త



మండలం ఎంపిడిఓగా విధులు నిర్వహిస్తున్న భానుప్రసాద్ బదిలీ అయ్యారు. ఎంపిడిఓ మాట్లాడుతూ కలకడ ఎంపిడిఓగా బదిలీ అయ్యానని మండలంలో నా సహచర ఉద్యోగులు, ప్రజలు, నాయకులు నాకు సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి పేరు పేరున కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. బదిలీపై వెళుతున్న ఎంపిడిఓ భానుప్రసాద్‌ను ఎంపిపి కుసుమకుమారి, డిప్యూటీ ఎంపిడిఓ గఫూర్, మునిస్వామినాయక్, సురేంద్ర బాబు, రెడ్డిశేఖర్ బాబా, పంచాయతీ సెక్రటరీలు తదితరులు ఘనంగా సన్మానం చేశారు.

## బుద్ధిమాంద్యులకు సేవ చేయడం గొప్ప వరం

### కురవంక సర్పంచ్ చలపతి



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

మదనపల్లె, జూన్ 30 ప్రభాతవార్త :

బుద్ధిమాంద్యులకు, వృద్ధులకు సేవ చేయడం గొప్ప వరమని సర్పంచ్ పసుపులేటి చలపతి తెలిపారు. సోమవారం పట్టణ సమీపంలోని అమ్మచెరువుమిట్ట వద్ద ఉన్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో సర్పంచ్ తనయుడు పసుపులేటి శశికుమార్ దివ్యాంగులకు, వృద్ధులకు సర్పంచ్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథలకు, దివ్యాంగులకు, వృద్దులకు అన్నదానం చేయడం తనకెంతో సంతోషకరంగా ఉందన్నారు. వెలుగు స్కూల్‌లో బుద్ధిమాంద్యులకు సేవలు అందిస్తున్న యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. అనంతరం వెలుగు సెక్రటరీ ఉదయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజలకు సేవ చేస్తూ పేద ప్రజల సంక్షేమాన్ని కొరుకునే సర్పంచ్ పసుపులేటి చలపతిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు కన్వీనర్ బాగ్యలక్ష్మి, బహుజన యువసేన రాష్ట్ర అధ్యక్షులు పునిత్, ప్రిన్సిపాల్ లీనాకుమారి, చిరంజీవి, హరిక్రిష్ణ, వినయ్, శశి, కార్తిక్, నాని, వెంకటేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## 27వ రోజు కొనసాగిన కార్మికుల సమ్మె

### వీధిలైట్లు, వాటర్ సరఫరా బంద్



సమ్మెలో పాల్గొన్న కార్మికులు

మదనపల్లె, జూన్ 30 ప్రభాతవార్త :

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సోమవారం 27వ రోజు సమ్మెను యదావిధిగా కొనసాగించారు. వాటర్ సరఫరా, వీధిలైట్లు బంద్ చేసి ఇంజనీరింగ్ కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. పట్టణం అందకారంగా నెలకొంది. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ కార్మిక జేఏసి నాయకులు ఎంఎస్.కన్నయ్య మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు పూర్తిస్థాయిలో విధులు బహిష్కరించి సమ్మె చేపట్టడం జరిగిందన్నారు. పట్టణంలో, వీధిలైట్లు, తాగునీటి సరఫరాను బంద్ చేసి సమ్మె చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటిల్లోనూ శాంతియుత సమ్మె నిరసన చేస్తున్నా ప్రభుత్వం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వం ఇంజనీరింగ్ కార్మికులకు అన్యాయం చేస్తున్నదన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా, ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు కూడా రాకుండా అన్యాయం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ జేఏసి నాయకులు ఎస్‌కె.రెడ్డప్ప, నాగరాజు, గోపాల్‌క్రిష్ణ, సజాద్‌కుమార్, బాలక్రిష్ణ, కుమార్, మహేష్, ఇంజనీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

## వైకాపా హయాంలో ముస్లింలకు పెద్దపీట

### నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్



సమావేశంలో పాల్గొన్నా నాయకులు

మదనపల్లె, జూన్ 30 ప్రభాతవార్త :

వైకాపా ప్రభుత్వ హయాంలో ముస్లిం మైనార్టీలకు పెద్దపీట వేశారని నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్ తెలిపారు. సోమవారం విజయవాడలో జరిగిన వైకాపా మైనార్టీల సదస్సులో ఆత్మీయ సదస్సులో ఆయన మాట్లాడుతూ దివంగత నేత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి మైనార్టీలకు నాలుగుశాతం రిజర్వేషన్ కల్పిస్తే తండ్రికి తగ్గ తనయునిగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ముస్లింలకు రాజకీయంగా పెద్దపీట వేశారన్నారు. డిప్యూటి సిఎం, కార్పోరేషన్ ఛైర్మెన్, మున్సిపల్ ఛైర్మెన్, డిప్యూటి ఛైర్మెన్, మండల పరిషత్ ఛైర్మెన్, ఎమ్మెల్సీ నియామకాల్లో ముస్లింలకు అధిక ప్రాధానత్య ఇచ్చారన్నారు. ముస్లిం వ్యక్తి సిఎంగా ఉన్నా ముస్లింలకు ఇంత సాయం చేసేవారు కాదేమోనన్నారు. ముస్లిం మైనార్టీలు ఎప్పుడూ వైకాపాకు అండగా ఉండాలన్నారు. దేశంలో ఏ రాజకీయ పార్టీ, ఏ నాయకుడు చేయని విధంగా ముస్లింలకు అన్ని విధాలుగా అండగా నిలిచిన ఏకైక పార్టీ వైకాపానే అన్నారు. మరో వైపు ముస్లింల పవిత్రమైన హజ్‌యాత్రకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. ముస్లింలను ఆర్థికంగా ఆదుకోవడానికి కూడా వైకాపా ప్రభుత్వ హయాంలో అనేక సబ్సిడీ రుణాలు మంజూరు చేసిందన్నారు. ముస్లింలు మరోసారి వైకాపాను గెలిపించి ముఖ్యమంత్రిగా జగన్‌ని గెలపించాలన్నారు.

## ఆర్థిక సహాయం

బద్వేల్ అర్బన్, జూన్ 30, ప్రభాతవార్త

బద్వేలు నియోజకవర్గంలోని అట్లూరు మండలం కుంభగిరి పంచాయతీ ఎస్ వెంకటాపురం గ్రామం జోన్నవరం కాలనీలో గొల్లపల్లి లక్ష్మీనరసమ్మ గొల్లపల్లి జయరామయ్యలు ఆటోలో ప్రయాణిస్తుండగా బయనపల్లి దగ్గర ఆటో ప్రమాదానికి గురై లక్ష్మి నరసింహ కు కాలు విరిగినది. అలాగే గొల్లపల్లి జయరామయ్య తీవ్రంగా గాయపడ్డారూ. ఈ విషయం తెలుసుకున్న టిడిపి యువ నాయకుడు పాలకొండు రాజశేఖర్ రెడ్డి, ఆయన అనుచర వర్గం కడపలోని ఆస్పత్రి దగ్గరికి వెళ్లి వాళ్లను పరామర్శించి రూ. 5000 ఆర్థిక సహాయం చేసి వారికి ధైర్యం చెప్పారు. ఈ ఈయన వెంట సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, పరశురాముడు, నారా ఎల్లయ్య, మల్లంకొండయ్య, మరియు కొంతమంది కార్యకర్తలు ఉన్నారు



## లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలి



పోలీస్ అధికారులతో సమావేశమైన మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి

రాజంపేట, జూన్ 30 ప్రభాతవార్త

జూలై 5న జరగనున్న జాతీయ లోక్అదాలత్‌ను కక్షి దారులు సద్వినియోగం చేసుకోనేలా విస్తృత ప్రచారం ఇవ్వాలని పోలీసు అధికారులను జిల్లా మూడవ జడ్జి ఎస్. ప్రవీణ్ కుమార్ ఆదేశించారు. సోమవారం తన చాంబర్లో సీనియర్ సివిల్ జడ్జ్ టి.కేశవ్,జూనియర్ సివిల్ జడ్జ్ పి. రంజన్ ఉదయ ప్రకాష్ లతో కలసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్ అదాలత్‌లో పరిష్కారం అయ్యే కేసులను పరిశీలించాలన్నారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో వున్న కేసులను పరిష్కరించు కొనేలా కక్షిధారులతో మాట్లాడి రాజీ మార్గాన ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో పలువురు న్యాయవాదులు, మూడు కోర్టుల సిబ్బంది పాల్గొన్నారు.

## బాధితుల సమస్యలు సత్వరం పరిష్కరించండి

### సబ్ కలెక్టర్ నైదియా దేవి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నైదియా దేవి

రాజంపేట, జూన్ 30 ప్రభాతవార్త

రెవిన్యూ సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని రాజంపేట సబ్ కలెక్టర్ నైడియాదేవి ఆదేశించారు. బాధితులు తాసిల్దార్ కార్యాలయంలో పరిష్కారం అయ్యేటట్లు ఉంటే అక్కడే అధికారులతో చర్చించాలని సూచించారు. మండలాలాల్లో పరిష్కారం కాకుంటేనే రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయానికి రావాలని కోరారు. సమస్య తెలుసుకోకుండా నేరుగా ఇక్కడకు రావద్దన్నారు. సోమవారం పిజిఆర్ఎస్లో 21 మంది బాధితులు వివిధ సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు వాటిని పరిష్కరించేందుకు అధికారులను ఆదేశించారు.

## రాజంపేట లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

రాజంపేట, జూన్ 30 ప్రభాతవార్త





రాజంపేట లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడుగా తరిగోపు ల లక్ష్మీ నారాయణ, సెక్రటరీగా సింగంశెట్టి కృష్ణ కుమార్, కోశాధికారిగా కంభయ్యగారి సుబ్బ నరసింహ లు ఎన్నికయ్యారు. 2025, 2026 లయన్స్ సంవత్సరమునకు క్లబ్ సభ్యులు వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు తరిగోపుల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తనను 5 వ సారి క్లబ్ అధ్యక్షుడుగా ఎన్నుకున్నారని,తనమీద క్లబ్ సభ్యులు చూపించిన అభిమానానికి తాను రుణపడి ఉంటానన్నారు.మరింత బాధ్యతగా సభ్యుల సహకారంతో సమాజ సేవ చేయడానికి ప్రయత్నిస్తామని అన్నారు.గతంలో చేసిన సేవలకు గుర్తింపుగా తనను బెస్ట్ ప్రెసిడెంట్ తో పాటు వివిధ సేవా సంస్థలు బెస్ట్ సిటిజన్ గా అవార్డులు ఇచ్చి గౌరవించారని అన్నారు.సెక్రటరీ కృష్ణ కుమార్ ,కోశాధికారి నరసింహ మాట్లాడుతూ తాము సాధ్యమైనన్ని ఎక్కువ ఆరోగ్య శిబిరాలు నిర్వ హిస్తామని, విద్యార్థులకు విద్యా సేవలతో పాటు ప్రజలకు అవసరమైన సేవలు అందిస్తామని అన్నారు.

## గ్రీవెన్స్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి



గాలివీడు, జూన్ 30(ప్రభాతవార్త):

గ్రీవెన్స్‌లో వచ్చే వివిధ రకాల దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ భాగ్యలత వీఆర్ఓలకు సూచించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రీవెన్స్‌లో భాగంగా ప్రజల దగ్గర నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ముఖ్యంగా భూములకు సంబంధించిన మ్యుటేషన్, చుక్కల భూములు, అడంగళ్లు, వన్‌బీ వంటి సమస్యలను తమ దృష్టికి తీసుకురావడంజరుగుతున్నదని పేర్కొన్నారు. గ్రామాల్లో వీఆర్ఓలు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న భూసమస్యలను పరిశీలించాలని తెలిపారు. ప్రస్తుతం నడుస్తున్న రీసర్వే విధానాన్ని పక్కాగా నిర్వహించాలని సర్వే అధికారులకు సూచించారు.

## పోస్టర్లను ఆవిష్కరించిన జేసీ...!

కడప, జూన్ 30(ప్రభాతవార్త):

సంతృప్తి కరమైన ఆర్థిక పరిపుష్టిపై 3 నెలల పాటు నిర్వహించే క్యాంపెయిన్ కు సంబంధించి.. కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ, బ్యాంకింగ్ రంగం ప్రచురించిన పోస్టర్లను ఎల్డిఎం, బ్యాంకు అధికారులతో కలిసి సోమవారం సభాభవన్ లో జిల్లా జేసీ అదితిసింగ్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆమె.మాట్లాడుతూ.. సమాజంలో ప్రతికుటుంబానికి ఆర్థిక పరిపుష్టి చేకూరేలా.. జిల్లాలో ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించడం, బ్యాంకింగ్ యాక్సెస్‌ను విస్తరించడం, డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడంతో పాటు విస్తృతంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల అమలు వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాల్సి ఉందన్నారు. ప్రజలను ఆర్థికంగా చైతన్యవంతం చేయడం, సామాజికంగా శక్తివంతం చేయడంలో జిల్లా యంత్రాంగం, బ్యాంకర్లు ఆయా శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.



# హార్సిలీహిల్స్‌ను రామ్‌దేవ్ బాబాకు ఇవ్వకండి

### సబ్‌కలెక్టర్‌కు సిపిఐ, కాంగ్రెస్ నాయకులు వినతి

మదనపల్లె, జూన్ 30 ప్రభాతవార్త :

ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌ను మత ప్రచారకుడు అయిన రామ్‌దేవ్ బాబాకు ఇవ్వద్దంటూ కాంగ్రెస్, సిపిఐ నాయకులు సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం సబ్‌కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల ప్రజావేధికలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు, కాంగ్రెస్ పట్టణ నాయకులు రెడ్డిసాహెబ్‌లు సబ్‌కలెక్టర్‌కు విన్నవించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రామ్‌దేవ్ బాబాకు హార్సిలీహిల్స్‌పైన స్థలం కేటాయించలేదని ఏపి టూరిజంలో కొంత మేరకు భవనాలు రాందేవ్ బాబాకు ఇవ్వడానికి ప్రభుత్వం యత్నిస్తొందన్నారు. ఇటీవల రామ్‌దేవ్ బాబా హార్సిలీహిల్స్‌ను సందర్శించడం జరిగిందన్నారు. ఒక మతానికి ప్రాధాన్యత వహించే వ్యక్తికి, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి యోగా ముసుగులో హార్సిలీహిల్స్‌లో ఆశ్రమం కల్పించడం రాజకీయ కుట్ర ఉందన్నారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మురళి మాట్లాడుతూ టిడిపి నాయకులు ఆర్‌జె.వెంకటేష్ వామపక్ష పార్టీలు అభివృద్దిని అడ్డుకొంటున్నారని అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. కమ్యూనిస్టులు అభివృద్ధిని సమాజ నిర్మాణాన్ని కోరుకునే వ్యక్తులు అన్నారు. కమ్యూనిస్టులు ఎప్పుడూ వ్యక్తిగత ప్రాధాన్యత ఇవ్వరన్నారు. జిల్లా అభివృద్దికి ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వెంకటేష్, మాదవ్ తదితరులు పాల్గొన్నారు.




సబ్‌కలెక్టర్‌కు విన్నవిస్తున్న నాయకులు

# కాంట్రాక్టుల బిల్లుల చెల్లింపు జాప్యంపై కౌన్సిల్ ఆవేదన




ప్రొద్దుటూరు, జూన్ 30, ప్రభాతవార్త

ప్రొద్దుటూరు పురపాలక సంఘంలో గత 15 నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు బిల్లుల చెల్లింపు జాప్యం పై మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ భవనంలో మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లె లక్ష్మిదేవి నాగరాజు ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు పొందుపరిచిన 12 అంశాల అజెండా తో నిర్వహించిన సమావేశం ప్రశాంతంగా ముగిసింది. సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలాన్ని దృష్టిలో వుంచుకొని పారిశుద్ధ్యం పై దృష్టి సారించాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. దోమల వలన ప్రమాదకరమైన మలేరియా, డెంగ్యూ, వంటి జ్వరాలు సోకే ప్రమాదం ఉందని, కావున దోమల నివారణకు ఫాగింగ్, మురుగునీటి కాల్వలలో ఆయిల్ బాల్స్ పిచికారీ చేపట్టడంతో పాటు ఎప్పటికప్పుడు మురుగునీటి కాల్వలు శుభ్రం చేయాలని వివరించారు. గత వైసిపి హయాంలో 2024 మార్చి 31 నాటికి కాంట్రాక్టర్లకు రావాల్సిన బిల్లులు పూర్తిగా చెల్లించామని తెలిపారు. కానీ గత 15 నెలలుగా కాంట్రాక్టర్లకు బిల్లులు రాక ఇబ్బందులకు గురవుతున్నారని మున్సిపల్ పరిధిలో అభివృద్ధి కుంటు పడే ప్రమాదం ఉందని, కమిషనర్ చొరవ తీసుకుని బిల్లులు మంజూరులో జాప్యం రాకుండా కృషి చేయాలని కోరారు. కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించి అభివృద్ధికి ప్రస్తుత ప్రభుత్వం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపాలిటీకి రావాల్సిన బకాయిలను వసూలు చేయాలని, కొర్రపాడు రోడ్డు లోని ఎస్ఎస్ మాల్ నుండి దాదాపు 5 కోట్ల 85 లక్షల రూపాయల బకాయి వుందని, వెంటనే వసూలు చేయాలని తెలిపారు. అనంతరం కౌన్సిలర్ జిలానీబాష మాట్లాడుతూ కొత్తగా వచ్చిన అధికారులు అధికార పక్షం, ప్రతిపక్షం అనే తేడా లేకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా కౌన్సిలర్ వెంకట సుబ్బారెడ్డి మాట్లాడుతూ చిన్నపాటి వర్షానికే తమ వార్డు జలమయం అవుతుందని, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, కావున వర్షపు నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా నూతన కమిషనర్ రవిచంద్రారెడ్డి కౌన్సిల్‌కు పరిచయం చేసుకున్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులకు అండగా నిలుద్దాం

మదనపల్లె, జూన్ 30 ప్రభాతవార్త :

పారిశుద్ధ్య కార్మికులకు అండగా నిలుద్దామని మున్సిపల్ ఛైర్‌పర్సన్ వరపన మనూజా కిరణ్‌రెడ్డి, వైస్ ఛైర్మెన్ జింకా వెంకట చలపతిలు తెలిపారు. సోమవారం ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి అధ్యక్షతన అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశాన్ని ఉద్దేశించి ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ కాంట్రాక్టర్స్ పనులు నిలిపివేయడంతో ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. అభివృద్ధి కుంటుపడుతుంది. ప్రస్తుతం బిల్స్ అప్లోడ్ చేస్తున్నామని ఆమె తెలిపారు. ప్రస్తుతం కాంట్రాక్టర్ల ద్వారా వర్కులను ముందుకు తీసుకెలుతున్నామన్నారు. ఇంకా ఏమైనా పెండింగ్‌లో ఉన్న వర్కులను పూర్తి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. కౌన్సిలర్ ప్రసాద్ బాబు మాట్లాడుతూ గత 27రోజులుగా నిరసన చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు అండగా వైసిపి పార్టీ సైతం ఉంటుందన్నారు. 42మంది వర్కర్స్ ఉండగా 80మంది పేర్లతో జీతాలు తీసుకుంటున్నారని దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని ఛైర్‌పర్సన్ దృష్టికి తీసుకొచ్చారు. వైస్ ఛైర్మెన్ జింకా వెంకటచలపతి మాట్లాడుతూ పట్టణంలో రెండు లక్షల ముప్పై వేల జనాభా ఉన్నారు. వారందరికి పారిశుద్ధ్య కార్మికులే సేవలు అందిస్తున్నారనే విషయాన్ని గుర్తించుకోవాలి. గత 27రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్న వారికి అండగా నిలవాల్సిన ప్రభుత్వం మొండి చెయ్యి చూపుతోంది. వారందరికి ఈ కౌన్సిల్ ద్వారా మద్దతు ఇస్తున్నామని తెలిపారు. వారికి జీతాలు పెంచి ఈ కౌన్సిల్ సమావేశంలో ద్వారా ఆమోదం తెలిపి ప్రభుత్వానికి నివేదిక పంపాలని ఛైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్ళారు. జనరల్ ఫండ్ నుంచి ఇవ్వడానికి ఆమోదం తెలుపుతున్నామన్నారు. ప్రస్తుతం కార్మికులకు ఎనిమిది గంటలు ఉన్న పని దినాలను పది గంటలకు పెంచే జీఓను తాము వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. టిపిఎస్ విభాగాలతో పాటు ఖాళీగా ఉన్న పదువులను వెంటనే భర్తీ చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ విషయాలపై స్పందించిన మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనూజా కిరణ్‌రెడ్డి మున్సిపల్ కార్మికులకు వైసిపి పార్టీ అండగా ఉంటుందని ఈ ఆమోద కాపీని ప్రభుత్వానికి పంపుతామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్‌శాఖ అధికారులు, కౌన్సిలర్లు నూర్ అజం, ఖాజాహుస్సేన్, శ్రీనివాసులు, పాల్ చంద్రశేఖర్, రామిశెట్టి శివయ్య, ప్రసాద్‌బాబు, గాంధీ, వసీం అక్రమ్, సరిత బాలగంగాదర్‌రెడ్డి, గిరిజా సాయిశేఖర్‌రెడ్డి, రేణుక, ఎస్ఎ.షబానా, కరీముల్లా, సుగుణ, అంజనేయులు, ముబీనా, సలీం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి, జింకా వెంకట చలపతిలు

## ఆక్రమణ వ్యాపారాలపై పంచాయతీ పంజా

ఒంటిమిట్ట జూన్ 30( ప్రభాతవార్త)

మండల కేంద్రమైన ఒంటిమిట్ట బస్టాండ్ లో వ్యాపారస్తులు తమ వ్యాపార అభివృద్ధి నిమిత్తం ఫుట్పాత్లను కూడా వదలకుండా ఆక్రమించిన నేపథ్యంలో ఒంటిమిట్ట పంచాయతీ కార్యదర్శి సుధాకర్ సోమవారం ఆక్రమిత వ్యాపారస్తుల దుకాణాలపై పంజా విసిరి ఫుట్పాతులపై సామాన్లను తమ సిబ్బంది చేత తొలగించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఒంటిమిట్ట మండల కేంద్రం కావడం చేత 13 పంచాయతీల ప్రజలు, ఇతరులు తమ పనుల నిమిత్తం ఒంటిమిట్టకు రావడం చేత ప్రధానంగా ఒంటిమిట్ట ఆంధ్ర భద్రాచలం కావడం చేత శ్రీ కోదండరామ స్వామి కొలువై ఉండడంతో స్వామి దర్శనార్థం పలు రాష్ట్రాల నుంచి ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తున్న నేపథ్యంలో జనసాంద్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రజల యోగక్షేమాలు, ట్రాఫిక్ దృష్టిలో పెట్టుకొని ఎటువంటి పర్మిషన్లు లేకుండా అక్రమంగా ఫుట్పాత్లను దుఖానా దారులు ఆక్రమించిన నేపథ్యంలో ఫుట్పాతులపై ఉన్న సామాన్లను, బోర్డులను తొలగించడం జరిగిందన్నారు. ప్రయాణికులు బస్సుల కొరకు నిరీక్షించేందుకు , సంచరించేందుకు ఫుట్పాతులపై దురాక్రమనగా నెలకొల్పిన సామానులు ఇబ్బందిగా ఉండటంతో తొలగించడం జరిగిందన్నారు. గతంలో కూడా దుకాణా దారులకు ప్రభుత్వపరంగా నోటీసులు ఇవ్వడం జరిగిందని రెండు వారాలు కావస్తున్న దుకాణాదారులు పంచాయతీ అధికారులకు సహకరించకపోవడంతో ఫుట్పాత్లను ఆక్రమించుకొని తమ వ్యాపారాలను అభివృద్ధి చేస్తున్న వారిపై ఈ దినము ప్రభుత్వపరంగా చర్యలు తీసుకోవడం, సామాన్లను, బోర్డులను తొలగించడం జరిగిందన్నారు.



## పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

దువ్వూరు, జూన్ 30, ప్రభాతవార్త:

మండల పరిధిలోని 15గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవారం వృద్దులు, వికలాంగులు, వితుంతువుల పింఛన్లను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీఈడీఓ రామకృష్ణ తెలిపారు. మండలంలో 7126 మందికి పింఛన్లు పంపిణీ చేయవలసి ఉందని వీరికి సుమారు 3కోట్ల 4లక్షల రూపాయలు నిధులు ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేసేందుకు మండలంలో 131మంది ప్రభుత్వ సిబ్బందిని వినియోగిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం ఉదయం 7గంటల నుండి పింఛన్లు పంపిణీ చేస్తారని లబ్దిదారులు ఇళ్ల దగ్గర ఉండి పింఛన్ల డబ్బులను తీసుకోవాలని తెలిపారు.

## నిర్ణీత ధరలకే ఎరువులను విక్రయించాలి

దువ్వూరు, జూన్ 30, ప్రభాతవార్త:

మండలంలోని రసాయనిక ఎరువులు, పురుగుమందుల దుకాణాల వారు ప్రభుత్వం నిర్ణయించిన నిర్ణీత ధరలకే ఎరువులను విక్రయించాలని లేనిచో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి అమర్ నాథ్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన దువ్వూరులోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు రైతులకు అవసరమైన రసాయనిక ఎరువులు సిద్ధంగా ఉన్నాయని ఎటువంటి కొరత లేదన్నారు. ఎవరైనా దుకాణా దారులు ఎమ్మార్పీ ధరలకంటే ఎక్కువగా విక్రయిస్తే లైసెన్స్ రద్దుతో పాటు కేసులు కూడ నమోదు చేస్తామన్నారు. ఈ సంధర్భంగా పలు దుకాణాల్లో ఎరువుల నాణ్యతను పరిశీలించేందుకు శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపుతున్నట్లు తెలిపారు. ల్యాబ్‌లో నాణ్యత ప్రమాణాలు ఉన్నాయా లేదో తెలుస్తుందని ఒకవేళ నాణ్యత తక్కువగా ఉంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. దుకాణాదారులు రైతులకు అందుబాటులో ఉండి ఎమ్మార్పీ ధరలకే ఎరువులు విక్రయించాలన్నారు.



## రాయితీపై డ్రోన్ పంపిణీ



సుండుపల్లె, జూన్ 30, ప్రభాతవార్త :

సుండుపల్లె మండలమునకు వ్యవసాయం మనకు సంబంధించి రాయితీపై డ్రోన్ పరికరము మంజూరు చేయబడినదని జెడి శివ నారాయణ తెలియజేశారు. సుండుపల్లి గ్రామ పంచాయతీ సచివాలయం మూడు నందు సమావేశం ఏర్పాటు చేశారు ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని డ్వాక్రా సంఘాల ద్వారా ఈ డ్రోన్ ఇవ్వడం జరుగుతుందని దీని విలువ మొత్తము 10 లక్షల రూపాయలు అవుతుందని 50 శాతం రాయితీ ఉంటుందని తెలియజేశారు. కెనరా బ్యాంకు సుండుపల్లి శాఖ మేనేజర్ మస్తాన్ మాట్లాడుతూ రాయితీ పోను 5 లక్షల రూపాయలు బ్యాంకు లోను ద్వారా మంజూరు చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ వ్యవసాయ శాఖ శ్రీలత, అగ్రికల్చర్ ఆఫీసర్ సుండుపల్లి మహబూబ్బాషా, రాజంపేట పార్లమెంట్ వాణిజ్య విభాగ కార్యదర్శి దామోదర్ నాయుడు, డ్వాక్రా సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

### టిడిపి కమిటీ ఎన్నికలు

## పారదర్శకంగా చేపట్టండి



తంబళ్లపల్లె జూన్ 30 ప్రభాతవార్త ః

తంబళ్లపల్లె నియోజకవర్గం లో చేపట్టిన టిడిపి సంస్థాగత ఎన్నికల ప్రక్రియ మండల కమిటీ పరిశీలకులు పారదర్శకంగా చేపట్టి త్వరగా పూర్తిచేయాలని తంబళ్లపల్లి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు వల్లెపు సోమశేఖర్ సూచించారు. సోమవారం పార్టీ ప్రధాన కార్యాలయంలో తంబళ్లపల్లె, బి కొత్తకోట, మొలకలచెరువు, పెద్దమండెం టిడిపి మండల కమిటీ పరిశీలకులతో ఆయన సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన ఇంతవరకు నాలుగు మండలాలలో పరిశీలకులు జరిపిన ఎన్నికల ప్రక్రియ విధి విధానాలు, కార్యకర్తల మనోభావాలు, వారి అభిప్రాయాలు సేకరించిన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణకు మారుపేరని పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు ల సూచనల మేరకు మండల ఎన్నికల పరిశీలకులు క్షేత్రస్థాయిలో పార్టీ సీనియర్లు తోబాటు యువత, మహిళలు అభిప్రాయాలు తీసుకోవాలని అభిప్రాయ సేకరణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా సమావేశాలలో టిడిపి కుటుంబ సభ్యులు మధ్య విభేదాలు పొడచూపితే ఇరువర్గాలతో చర్చించి సామరస్యంగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల టిడిపి ఎన్నికల పరిశీలకులు రెడ్డప్ప, శ్రీనివాసులు, రెడ్డి శేఖర్, సీ తప్పలు పాల్గొన్నారు.

### ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన

## మంచిని ప్రజలకు వివరించండి

### టిడిపి నాయకులు నంద్యాల రాఘవరెడ్డి

ప్రొద్దుటూరు జూన్ 30 ప్రభాతవార్త

గడచిన ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన మంచిని ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలని తెలుగుదేశం నాయకులు నంద్యాల రాఘవరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం స్థానిక భారత్ కళ్యాణ మండపంలో టిడిపి నాయకులు నంద్యాల రాఘవరెడ్డి అధ్యక్షతన సుపరి పాలన తొలి అడుగు కార్యక్రమం పై బూతు క్లస్టర్ యూనిట్ ఇన్చార్జి లకు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసంతో రాష్ట్రం పూర్తిగా నాశనం అయిందని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది సమయంలో ఇచ్చిన హామీల మేరకు చేసిన మంచిని ప్రజలకు వివరించేందుకు జూలై రెండు నుండి సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రారంభించాలని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ నిర్ణయించిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలతో పాటు బూతు క్లస్టర్ యూనిట్ ఇన్చార్జులు ప్రతి ఒక్కరూ ప్రతిరోజు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తూ రాష్ట్ర టిడిపి శాఖ నిర్దేశించిన మై టిడిపి ఆప్ ను అందుబాటులోకి తెచ్చింది అన్నారు ఈ యాప్ ఉపయోగించుకుని ప్రభుత్వ విధానాలను వివరంగా పొందుపరచాలన్నారు. ప్రధానంగా ఈ కార్యక్రమంలో బూత్ ఇన్చార్జులు మండల పార్టీ అధ్యక్షులు యూనిట్ క్లస్టర్ ఇంచార్జిలు మరియు గ్రామ పార్టీ అధ్యక్షులు కేఎస్ఎస్ సభ్యులు ప్రతి ఇంటిని సందర్శించాలని తెలిపారు సందర్శించిన ఎంపీ సభ్యులకు పార్టీ తయారుచేసిన పాంప్లెట్ ను అందజేసి వారి అభిప్రాయాలను యాప్లో పొందుపరిచాల్సి ఉంటుందన్నారు. యాపు కు సంబంధించిన వివరాలను దాన్ని ఉపయోగించే విధానాన్ని ఆయన వివరించారు. ప్రధానంగా తల్లికి వందనం ప్రతి ఇంటిలో ఉన్న పిల్లలకు అందరికీ లబ్ధి చేకూరేలా పథకం రూపొందించామని అలాగే ఉచిత గ్యాస్ సిలిండర్లు ఆగస్టులో ఉచిత బస్సు ప్రయాణం రైతు భరోసా ఇలాంటి పథకాలు అమలు చేస్తున్నట్లు ప్రజలకు వివరించాలన్నారు. అలాగే ప్రతి ఇంటిని సందర్శించినప్పుడు ఆ కుటుంబం సభ్యుల సమస్యలను అడిగి తెలుసుకోవాలన్నారు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలలో ఏదైనా సమస్య ఉంటే వారి నుండి సమాచారం అందుకొని రాష్ట్ర పార్టీ శాఖకు పంపించాల్సి ఉంటుందన్నారు భవిష్యత్తులో కూటమి ప్రభుత్వం చేయనున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి టిడిపి పట్టణ అధ్యక్షులు ఇవి సుధాకర్ రెడ్డి వాల్మీకి బోయ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు వక్ బోర్డు రాష్ట్ర డైరెక్టర్ బేపారి జాకీర్ అహమ్మద్ టిడిపి మైనారిటీ నాయకులు బేపారి ఆరిఫ్ బేపారి గౌస్ కాచన శ్రీనివాస్ రెడ్డి మహిళా నేతలు భోగా శివ కళ్యాణి హసీనా మరియు టిడిపి నాయకులు కార్యకర్తలు బూతు ఇన్చార్జులు క్లస్టర్ ఇంచార్జిలు యూనిట్లు ఇన్చార్జులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

